ప్రజాశక్తి

శనివారం 14 జనవరి 2023 8 పేజీలు

ప్రకాశం బాపట్ల







ధర్నా కరపత్రాలను ఆవిష్కరిస్తున్న రైతుసంఘాల నాయకులు

ధర్నాను జయప్రదం చేయండి

కరపత్రం ఆవిష్కరించిన రైతుసంఘాల నాయకులు

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

మాండూస్ తుఫాన్‌తో నష్టపోయిన రైతులకు పరిహారం ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ ఈ నెల 19న కలెక్టర్ కార్యాలయం వద్ద పొగాకు రైతుల ధర్నాను జయప్రదం చేయాలని రైతు నాయకులు కోరారు. స్థానిక ఎల్‌బిజి భవన్‌లో శుక్రవారం రైతు సంఘాల నాయకుల సమావేశమై 19వ తేదీ ధర్నా కార్యక్రమం జయప్రదం చేయటానికి ప్రచార కార్యక్రమాన్ని ఖరారు చేశారు. ధర్నా కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ నెల 14న ఉదయం మద్దిపాడు మండలం వెంకటరాజుపాలెం, బసవన్నపాలెం, సాయంత్రం ఒంగోలు మండలం కరవది, కొప్పోలు గ్రామాలలో ప్రచారం నిర్వహించాలని తీర్మానించారు. 16వ తేదీ నాగులుప్పలపాడు మండలం అమ్మనబ్రోలు, పోతవరం. చీర్వానుప్పలపాడు గ్రామాలలో, 17వ తేదీ ఉదయం టంగుటూరు మండలంలో, సాయంత్రం కొండపి మండలంలో ప్రచారం నిర్వహించాలని నిర్ణయించారు. రైతు నాయకులు మాట్లాడుతూ పూర్తిగా దెబ్బతిన్న పొగ చేలకు ఎకరాకు రూ.25 వేలు, పాక్షికంగా దెబ్బతిన్న పొగ చేలకు రూ.10 వేలు నష్ట పరిహారం బోర్డు నుంచి ఇప్పించాలన్నారు. బ్యాంకులలో రైతులకు ఇచ్చిన బాకీలు వడ్డీ లేకుండా రీషెడ్యూల్ చేయాలన్నారు. తిరిగి బ్యాంకు లక్ష రూపాయలు వడ్డీ లేని రుణం ఇప్పించాలన్నారు. నష్టపరిహారం కౌలు రైతులకు వర్తింప చేయాలని డిమాండ్ చేస్తూ జరిగే ధర్నాలో అధిక సంఖ్యలో రైతులు పాల్గొనాలని కోరారు. కార్యక్రమం ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి పమిడి వెంకటరావు, సంయుక్త కిసాన్ మోర్చా జిల్లా కన్వీనర్ చుండూరి రంగరావు, ఆచార్య రంగా కిసాన్ సంస్థ జిల్లా కార్యదర్శి చుంచు శేషయ్య, రైతు సంఘం జిల్లా నాయకులు ఎస్‌కె మాబు, జుజ్జూరి జయంతిబాబు, అబ్బూరి వెంకటేశ్వర్లు, కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి వి.బాలకోటయ్య, జిఎంపిఎస్ రాష్ట్ర కార్యదర్శి కిలారి పెద్దబ్బాయి పాల్గొన్నారు.

ప్యాకేజీ కోసం ఎదురుచూపులు

- **మూడేళ్లుగా ప్రభుత్వం నిధులు ఇవ్వనందునే వెలుగొండ నిర్వాసితులకు అందని ఫలితం**
- **సెప్టెంబరులో ప్రాజెక్టును ప్రారంభిస్తామని ప్రకటించిన సిఎం జగన్**
- **ఇంతవరకూ ముంపు ఊళ్లను ఖాళీ చేయని నిర్వాసితులు..**
- **నేడు ముంపు గ్రామాల్లో సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు పర్యటన**



ప్రజాశక్తి-ఒంగోలుబ్యూరో

వచ్చే సెప్టెంబరులో వెలుగొండను ప్రారంభించాకే ఎన్నికలకు వెళతాం..

- చీమకుర్తిలో జరిగిన సభలో సిఎం జగన్ చేసిన ప్రకటన ఇదీ..

వెలుగొండ ప్రాజెక్టు నిర్మాణ పనులు దాదాపుగా పూర్తయ్యాయి. మిగిలింది నిర్వాసితులకు ప్యాకేజీలు ఇవ్వడమే. ఇందుకోసం రూ.1200 కోట్లకు పైగానే నిధులు కావాలి. మూడేళ్లుగా ఈ నిధుల కోసం నిర్వాసితులు ఎదురు చూస్తున్నారు. రాష్ట్రప్రభుత్వం ఇవ్వడం లేదు. బడ్జెట్‌లో పనులకు మాత్రమే కేటాయింపులు చేశారు. ఈ ఏడాది కూడా రూ.856 కోట్లు కేటాయించారు. నిధులు ఆశించిన స్థాయిలో కేటాయింపులు లేనందున 105 కోట్లు మాత్రమే ఖర్చుపెట్టారు. నిర్వాసితుల కోసం కేటాయింపులు లేవు. 2019లో తుది జాబితాను ఖరారు చేశారు. ఒక్కో కుటుంబానికి వన్ టైం సెటిల్‌మెంటు కింద రూ.12.50 లక్షలు ఇస్తున్నారు. దీనికి నిర్వాసితులు అందరూ ఆమోదించారు. ఈ ప్యాకేజీతో పాటు ఇంటి స్థలం ఇస్తారు. మూడేళ్ల క్రితం ఖరారైన జాబితాలో నిర్వాసితులు 7,234 మంది ఉన్నారు. నిధులు లేకపోవడంతో జాప్యం జరిగింది. ఇప్పుడు మళ్లీ నిర్వాసితుల సంఖ్య పెరిగింది. ఈ కుటుంబాల్లో పిల్లలు పెద్దయ్యారు. 18 ఏళ్లు దాటిన వారికి ప్యాకేజీ ఇవ్వాల్సి ఉంది. కొత్తగా పెళ్లిళ్లు చేసుకున్నారు. ఇలాంటి వాళ్లు ప్రస్తుతం 1200 మంది వరకూ ఉన్నట్లు అంచనా. వీరిని కూడా జాబితాల్లో చేర్చాలనే డిమాండ్ ముందుకు వచ్చింది. గతంలో 2005లో జాబితాను తయారుచేశారు. అప్పటి నుంచీ ప్యాకేజీలు ▶ 3లో

నేడు సిపిఎం రాష్ట్ర కార్యదర్శి పర్యటన



వెలుగొండ ప్రాజెక్టు నిర్వాసిత గ్రామాల్లో శనివారం నాడు సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు పర్యటించనున్నారు. గొట్టిపడియ గ్రామం నుంచి ఆయన పర్యటన ప్రారంభం కానుంది. సమీప గ్రామాల్లో పర్యటించి నిర్వాసితుల సమస్యలను తెలుకుంటారు. గతంలోనూ నిర్వాసితుల పక్షాన సిపిఎం అనేక పోరాటాలు చేసిన సంగతి తెలిసిందే.

పందేనికి సై

- **కోడిపందేలు, పొట్టేళ్ల పోటీలకు రంగం సిద్ధం**
- **పక్క జిల్లాలతో పాటు తెలంగాణా నుంచి కూడా జూదరులు వస్తారని అంచనా..**



రేపల్లెలో నిర్వహిస్తున్న పొట్టేళ్ల పోటీలు

ప్రజాశక్తి-రేపల్లె

జూదరులు పందెం కోళ్లను సంక్రాంతి సమరానికి సిద్ధం చేస్తున్నారు. మరోపక్క పోలీసులు కేసులు పెడతామని.. హెచ్చరిస్తున్నా.. లెక్కచేయడం లేదు. మూడు రోజులు కోలాహలం చేసేందుకు పందెంరాయుళ్లు సిద్ధమవుతున్నారు. బరులను సిద్ధం చేసే పనిలో నిర్వాహకులు బిజీగా ఉన్నారు. పందేలకు గుంటూరు, కృష్ణా, బాపట్ల, ప్రకాశం, నెల్లూరు జిల్లాలతో పాటు తెలంగాణ నుంచి భారీగా జూదరులు వస్తారనే అంచనాల్లో నిర్వాహకులున్నారు. గురువారం బరుల్లో పొట్టేళ్ల పోటీలను ప్రారంభించారు.

రేపల్లె నియోజకవర్గంలోని పెనుమూడి-ఓలేరు మార్గంలోని 216 జాతీయరహదారి పక్కనే ఉన్న వెంచర్లలో పదుల సంఖ్యలో బరులు ఏర్పాటుచేశారు. గురువారం పొట్టేళ్ల పోటీలు, ట్రాక్టర్ రివర్స్ పోటీల పేరుతో జూదక్రీడలు ప్రారంభించారు. నాలుగు రోజుల పాటు పగలు, రాత్రి నిర్వహించేందుకు అధికారపార్టీ మండల నాయకులు అన్ని ఏర్పాట్లు చేశారు. గుంటూరు, కృష్ణా, బాపట్ల, ప్రకాశం, నెల్లూరు జిల్లాలతో పాటు తెలంగాణ నుంచి భారీగా జూదరులు వస్తారని అంచనాలు వేసుకొని ఆ స్థాయిలో ఏర్పాట్లు చేశారు. మండలంలోని పెనుమూడితో పాటు మరికొన్ని చోట్ల చిన్న చిన్న బరులను సిద్ధం చేశారు.

పోలీసుల హెచ్చరికలున్నా..

ఏటా సంక్రాంతి సమయంలో ముఖ్యంగా తీరప్రాంతంలో జరిగే కోడి పందేలను అడ్డుకొని తీరుతామంటూ పోలీసులు హెచ్చరిస్తుంటారు. పండగకు కొద్దిరోజుల ముందు కాస్త హడావుడి చేస్తారు. కానీ ఆ మూడు రోజులు మాత్రం పోలీస్ స్టేషన్లకు అతి సమీపంలోనే పందేలు జరుగుతున్నా.. చూసీచూడనట్టు ఉంటారు. ఈ ఏడాది కూడా కోడిపందేల నిర్వహణకు అనుమతి లేదంటూ పోలీసులు చెబుతున్నారు. అదే సమయంలో బహిరంగంగానే భారీ ఏర్పాట్లు మరోవైపు సాగుతుండటం గమనార్హం.. ఆర్థిక, రాజకీయ వ్యవహారాలతో ముడిపడిన కోడి పందాల విషయంలో నియంత్రణ సాధ్యమేనా అన్నది చర్చనీయాంశం.

వందలాది పెంపకం కేంద్రాలు

రేపల్లె నియోజకవర్గంలో పందెం కోళ్ల పెంపకం కేంద్రాలు ▶ 2లో



సంక్రాంతి సంబరాలలో భాగంగా భోగి మంటలు వేస్తున్న ప్రకాశం కలెక్టర్, మేయర్, ఎస్‌పి, కమిషనర్

సాంప్రదాయాల పండుగ సంక్రాంతి 5లో ▶



సంక్రాంతి సంబరాలలో కలెక్టర్, ఎస్‌పి

సంస్కృతిని గౌరవించాలి: కలెక్టర్ 8లో ▶

సబ్సిడీపై శనగవిత్తనాలు

మద్దిపాడు : రైతులకు 80 శాతం సబ్సిడీపై శనగ విత్తనాలు అందజేస్తున్నట్లు ఎఒ రమేష్‌బాబు తెలిపారు. స్థానిక వ్యవసాయ కార్యాలయంలో సలహామండలి సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ సలహా మండలి చైర్మన్ రాము, ఎఇఒ శేషయ్య పాల్గొన్నారు. **సంతనూతలపాడు రూరల్ :** ఎంపిడిఒ కార్యాలయంలో వ్యవసాయ సలహా మండలి సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయ శాఖ అధికారి వి. వెంకట శేషమ్మ, ఎఒ పావని, వ్యవసాయ సలహా మండలి చైర్మన్ బోయెళ్ల నరసింహారావు, ఎఇఒ సుబ్బారెడ్డి, వ్యవసాయ సలహా మండలి సభ్యులు, వ్యవసాయ సహాయకుడు దుర్గాప్రసాద్ రైతులు పాల్గొన్నారు. **దొనకొండ :** స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో వ్యవసాయ సలహా మండలి సమావేశం చైర్మన్ గుమ్మా వెంకటేశ్వర్లు ఆధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎఒ లక్ష్మినారాయణ, జడ్‌పిటిసి సుధాకర్, వ్యవసాయ మండలి సభ్యులు, ఆర్‌బికె సిబ్బంది పాల్గొన్నారు.

పందేనికి సై..

(మొదటిపేజీ తరువాయి)

దాదాపు 100కు పైనే ఉన్నాయి. ఒక్కొక్క ఫామ్‌లో 100 నుంచి 150 కోళ్లకు ట్రైనింగ్ ఇస్తున్నారు. సంక్రాంతి సమీపిస్తుండటంతో నియోజకవర్గంలో ఇప్పటికే ఐదు వేల కోళ్లకు పైనే పందేలకు సిద్ధమవుతున్నట్లు సమాచారం. కొన్ని కేంద్రాల్లో స్పెషల్‌గా మేలుజాతి పందెం పుంజులు, పెట్టల నుంచి గుడ్లను పొదిగించి ఆ పిల్లలను జాగ్రత్తగా పెంచుతున్నారు. ఆరు నెలల నుంచి సంవత్సరం వయసు వచ్చే వరకు గుంపులుగా బయట పెంచి తర్వాత నుంచి ఒక్కొక్క పందెం కోడిని విడివిడిగా పెంచుతారు. ఈ పందెం కోళ్లను పెంచడానికి విశాలమైన స్థలాలను లీజుకు తీసుకుంటారు. వాటి కోసం ప్రత్యేకంగా గాబులు, గ్రిల్స్‌తో కూడిన బాక్సులు తయారు చేయిస్తారు.

కోడిపుంజు జాతిని బట్టి పందెం

ముఖ్యంగా పందేలకు ట్రైనింగ్ ఇచ్చే కోళ్ల జాతులు దాదాపుగా 90 వరకు ఉన్నాయి. వీటిలో డేగ, కాకి, కాకిడేగ, నెమలి, కాకి నెమలి, నెమలి డేగ, ఎర్ర కొక్కిరాయి, నెమలి పింగళ, సీతువా, రసింగ్, పచ్చ కాకి, అబ్రాస్, తెల్ల కొక్కిరాయి, పెట్టమారి, కోడి డేగ, నల్ల కొక్కిరాయి, డేగ పూల లాంటి పందెం కోళ్లు, జాతులను బట్టే పందెం రాయుళ్లు బెట్టింగులు కాస్తారు. ప్రస్తుత జనరేషన్లో పెర్విన్ తూర్పు, పర్ల, మైల జాతుల కోళ్లను పోటీలకు అధికంగా వినియోగిస్తున్నారు.

సచివాలయ కన్వీనర్ల నియామకం

ప్రజాశక్తి-దర్శి

దర్శి నియోజక వర్గ పరిధిలోని అన్ని సచివాలయాలకు కన్వీనర్లను నియమించినట్లు ఎమ్మెల్యే డాక్టర్ మద్దిశెట్టి వేణుగోపాల్ తెలిపారు. దర్శి సచివాయల కన్వీనర్‌గా వెదురు కోటిరెడ్డి, రాజంపల్లి కన్వీనర్‌గా బత్తినేని వెంకటేశ్వర్లు, ముండ్లమూరు మండలం శంకరాపురం కన్వీనర్‌గా మేడికొండ జయంతి, తాళ్ళూరు మండలం తూర్పుగంగవరం కన్వీనర్‌గా యాడిక శ్రీనివాసరెడ్డి, కురిచేడు కన్వీనర్‌గా ఎం. సుబ్బారెడ్డి, దొనకొండ సచివాలయ కన్వీనర్‌గా గుంటు పోలయ్య నియమితులయ్యారు. తొలుత ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో విద్యుత్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మద్దిశెట్టి శ్రీధర్, విద్యుత్ అధికారులు పాల్గొన్నారు.

భారీ దొంగతనం కేసును ఛేదించిన పోలీసులు

ముద్దాయిల నుంచి రూ.60 లక్షల విలువైన బంగారు, వెండి ఆభరణాలు, మోటార్ వాహనాలు స్వాధీనం

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

బాపట్ల జిల్లాలోని చుండూరు మండలం మోదుకూరు గ్రామంలో కొండమడుగుల వెంకట రమణారెడ్డి అనే వ్యక్తికి చెందిన గృహంలో గతేడాది నవంబరు నెల 9వ తేదీ జరిగిన భారీ దొంగతనం కేసును బాపట్ల జిల్లా పోలీస్ అధికారులు ఛేదించారు. ముద్దాయిల వద్ద నుంచి రూ.60 లక్షల విలువైన బంగారు, వెండి ఆభరణాలు, మోటార్ వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. ఎటువంటి ఆధారాలు లేని ఈ దొంగతనం కేసును ఛేదించిన పోలీస్ అధికారులను బాపట్ల జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ అభినందించారు. శుక్రవారం ఎస్‌పి క్యాంపు కార్యాలయంలో జరిగిన విలేఖరుల సమావేశంలో నేరం జరిగిన తీరు మరియు ముద్దాయిలను గుర్తించి అరెస్టు చేసిన అంశాల గురించి మీడియాకు ఎస్పీ వివరించారు. ఫిర్యాది అయిన రమణారెడ్డి గతేడాది నవంబరు నెల 9వ తేదీన రాత్రి భోజనం చేసి వారి ఇంటి మధ్య గదికి తాళం వేసి హాలుకు పక్కన ఉన్న గదిలో నిద్రపోయారు. మరుసటి రోజు ఉదయం లేచి చూసేసరికి వారి ఇంటి మధ్య గది తాళం గడియ విరగగొట్టి తాళం కప్ప నేలపై పడి వుండటం, బీరువా మరియు అన్ని అలమరాలు తెరిచి వుండటం చూసి ఇంటిలో దొంగలు పడినట్లు గమనించారు. ఇంటిలోని బీరువాలోఉంచిన కిలోన్నర బంగారు నగలు, సుమారు 1కిలో వెండి పూజా సామగ్రి, రూ.12 వేల నగదు, 43 అంగుళాల కొత్త టివి పోయినట్లుగా



పోలీసులు స్వాధీనం చేసుకున్న వాహనాలు

గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాపట్ల జిల్లా ఎస్పి వకుల్ జిందాల్ ఆదేశాలతో రేపల్లె సబ్ డివిజినల్ పోలీస్ ఆఫీసర్ టి మురళీకృష్ణ, జిల్లా సిసిఎస్ ఇన్‌స్పెక్టర్, చుండూరు సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌లతో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి మోదుకూరు చుట్టుపక్కల ప్రాంతాలలో సిసి కెమెరాలు పరిశీలించి, పాత నేరస్తుల వివరాలు సేకరించడం ద్వారా కేసును ఛేదించారు. ఈ మేరకు ఈ చోరీ కేసులో నిందితులుగా ఉన్న ఘంటసాల గ్రామానికి చెందిన తాతా ప్రసాద్ అలియాస్ మామిళ్లపల్లి శశికాంత్, బేతపూడి గ్రామానికి చెందిన దేవర అబ్బన్న అలియాస్ వర్మలను అరెస్టు చేసి చోరీ సొత్తును స్వాధీనపరచుకున్నారు. ఒకటో నిందితుడు ప్రసాద్ 2009 నుంచి దొంగతనాలకు అలవాటు పడి గుంటూరు, బాపట్ల, వేటపాలెం, ఒంగోలు, తిరుపతి, నెల్లూరు, నరసాపురం, జగ్గయిపేట, గన్నవరం, విశాఖపట్నం, విజయనగరం, సంగారెడ్డి(తెలంగాణ) లాంటి పలు చోట్ల దొంగతనాలు చేసి అరెస్టు అయ్యాడు. ఇతను కారులో తిరుగుతూ తాళం వేసి వున్న ఇళ్లను టార్గెట్ చేసుకుని దొంగతనాలు చేస్తువచ్చినట్లు ఎస్‌పి తెలిపారు. రెండో నిందితుడు కార్ డ్రైవింగ్ చేస్తూ ఒకటో నిందితునితో కలిసి నెల్లూరు, గన్నవరంలలో బైక్ దొంగతనాలు, అలాగే వేటపాలెం మరియు మోదుకూరులలో దొంగతనాలు చేశాడు. నిందితుల నుంచి సుమారు 600 గ్రాములు బంగారు నగలు, ఒక కేజీ వెండి వస్తువులు స్వాధీనపరచుకున్నారు. దొంగిలించిన సొత్తులో నిందితుడు ప్రసాద్ కొంత నగలను అమ్మి రూ.18 లక్షలతో గుంటూరు జిల్లా కొల్లిపర మండలం బొమ్మువనిపాలెంలో ఇల్లు కొనుగోలు చేసి తన భార్య పేరు మీద రిజిస్టర్ చేయించాడు. సదరు ఇంటి తాలూకు డాక్యుమెంట్స్, రూ.2 లక్షల నగదు, ముద్దాయిలు ఇద్దరు కలిసి గన్నవరం, నెల్లూరులలో దొంగిలించిన మూడు ఎన్‌ఫీల్డ్ బైక్‌లను నిందితుల నుంచి రికవరీ చేసినట్లు ఎస్‌పి చెప్పారు. ఈ కేసు ఛేదనలో ప్రతిభ చూపిన చుండూరు సిఐ బి కళ్యాణ రాజు, సిసిఎస్ ఇన్‌స్పెక్టర్ ఎం మురళీకృష్ణ, ఎస్ఐలు జి నవీన్ కుమార్, కె కమలాకర్, ఎఎస్ఐ రాజ్ కుమార్, హెడ్ కానిస్టేబుల్స్ టి సూర్యప్రకాష్, జి ప్రసాద్, కానిస్టేబుల్స్ బి వాసు, ఎన్ వెంకటేశ్వరరావు, ఎన్ గోపికృష్ణలను ఎస్‌పి అభినందించి వారికి ప్రశంశా పత్రాలు అందజేశారు.

నూనె వెంకట లక్ష్మీ సుజాతకు ఘన నివాళి

ప్రజాశక్తి-చీమకుర్తి

సుదర్శన గ్రానైట్స్ అధినేత, ప్రముఖ పారిశ్రామికవేత్త నూనె వెంకట సుబ్రహ్మణ్యం సతీమణి నూనె వెంకట లక్ష్మీ సుజాతకు పలువురు ఘనంగా నివాళులు అర్పించారు. లక్ష్మీ సుజాత ఇటీవల మృతి చెందిన విషయం పాఠకులకు తెలిసిందే. శుక్రవారం లక్ష్మీ సుజాత వైకుంఠ సమారాధన సంధర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పలువురు ప్రముఖులు పాల్గొని నివాళులు అర్పించారు. నూనె వెంకట సుబ్రహ్మణ్యం కుటుంబ సభ్యులు నూనె వంశీకృష్ణ, నూనె అనుదీప్, నూనె హేమసుందరరావు, చంద్రమౌళి, గిరిధరరావులను పరామర్శించారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, గిద్దలూరు


బూచేపల్లి వెంకాయమ్మ, శివప్రసాదరెడ్డి నివాళి

ఎమ్మెల్యే అన్నా రాంబాబు, మాజీ ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద రావు, ఆర్యవైశ్య సంఘం మాజీ అధ్యక్షులు చలువాది బదరీ నారాయణ, సంఘం నాయకులు కనమర్లపూడి హరిప్రసాదరావు, ఎస్ సురేష్, కూరపాటి సుబ్బారావు, హరిప్రియ గ్రానైట్స్ శిద్దా నాగేశ్వరరావు, పెరల్ గ్రానైట్స్ చలువాది నాగేశ్వరరావు, గోగినేని నాగయ్య, పమిడి రంగయ్య, యూటిఎఫ్ నాయకులు చలువాది శ్రీను, దేవదాసు, రమేష్, శిలార్ నివాళులు అర్పించారు.

ప్యాకేజీ కోసం ఎదురుచూపులు

(మొదటిపేజీ తరువాయి)

ఇవ్వలేదు. దీంతో 2019లో ఆందోళన చేశాక సర్వే చేసి.. తుది జాబితాను తయారుచేశారు. వెంటనే ప్యాకేజీలు ఇచ్చి పునరావాసం కల్పిస్తే ఖాళీ చేసి.. కాలనీలకు చేరుకునేవాళ్లు. ఈ ప్రక్రియ జరగలేదు. గతంలో మాదిరిగానే పెరగడంతో వీళ్లంతా తమకు ప్యాకేజీలు ఇవ్వాలని కోరుతున్నారు. వాస్తవానికి వీళ్లంతా న్యాయబద్ధంగానే అర్హులు.

12 ఊళ్లకు ప్యాకేజీలు ఇస్తేనే తరలింపు..

వెలుగొండ ప్రాజెక్టులో 12 ముంపు గ్రామా లున్నాయి. 7234 కుటుంబాలున్నాయి. జనాభా పరిగణలోకి తీసుకుంటే పాతికవేల మందికిపైగా ఉన్నారు. పశువులు కూడా ఉన్నాయి. ఇళ్లను ఇదిలేసి రావాలంటే వారికి ప్యాకేజీలు ఇవ్వాలి. మరోవైపు కొత్తగా ఏర్పాటు చేసే కాలనీల్లో ఇళ్లు కూడా మొదలుపెట్టలేదు. ప్యాకేజీతోపాటు ఇంటి స్థలం ఇవ్వాలి. అయితే ఇంకా గొట్టిపడియ, గుండంచర్ల గ్రామాల నిర్వాసితులకు ఇంటిస్థలాలు కూడా ఇవ్వలేదు. ప్యాకేజీలు ఇస్తేనే తరలిపోతామని నిర్వాసితులు గట్టిగా ఉన్నారు. ప్యాకేజీలు తీసుకోకుండా వెళితే ప్రాజెక్టు ప్రారంభించాక ఇస్తారో లేదోనన్న అనుమానం కూడా ఉంది. ఎందుకంటే 2005నుంచీ ప్యాకేజీల కోసం ఎదురుచూస్తూనే ఉన్నారు. జాబితాలు పెరుగుతూనే ఉన్నాయి. 2019లో కొత్త జాబితా తయారైంది. ప్యాకేజీలు మాత్రం అందలేదు.

8 నెలల్లో ప్రాజెక్టు ప్రారంభం సాధ్యమేనా?

సిఎం జగన్ చెప్పినట్లుగా సెప్టెంబరులో దీన్ని ప్రారంభించాల్సి ఉంది. అప్పటికి అన్నీ పూర్తికావాలి. నిర్మాణ పనుల్లో సొరంగాల నుంచి రిజర్వాయర్‌కు వచ్చే కాలువలు పూర్తికావాల్సి ఉంది. హెడ్‌రెగ్యులేటర్ పనులు తుదిదశకు వచ్చాయి. అయితే నిర్వాసితులను ఖాళీ చేయించాలంటే యుద్ధప్రాతిపదికన వారికి ఇళ్లు కట్టించాలి. కాలనీల్లో అన్ని సౌకర్యాలూ కల్పించాలి. వీటితో పాటు ప్యాకేజీలు ఇవ్వాలి. ఇవన్నీ రానున్న 9 నెలల్లోనే జరగాలి. ఇప్పటికే జనవరి నెల సగం గడిచింది. మిగిలింది కేవలం 8 నెలలే. సిఎం జగన్ చెప్పినట్లుగా అన్నీ జరగాలంటే నిధులదే పెద్ద సమస్యగా ఉంది.

ఆసక్తికరంగా పొట్టేళ్ల పోటీలు

ప్రజాశక్తి-పర్చూరు

పర్చూరు మండలం అన్నంభొట్లవారి పాలెంలో పొట్టేళ్ల పందేలు నిర్వహించారు. గొట్టిపాటి మెమోరియల్ క్రీడా ప్రాంగణంలో పోటీలు నిర్వహించారు. వివిధ మండలాల నుంచి 21 జతలు పోటీలో పాల్గొన్నాయి. ప్రథమ బహుమతిని మార్టూరు డైరీ ఫాం బుల్లోడు, ద్వితీయ బహుమతి కుందుర్తి మేకల మురళి, తృతీయ బహుమతిని శ్రీరామపురానికి చెందిన శ్రీనివాసరావు పొట్టేళ్లు గెల్చుకున్నాయి. గెలుపొందిన వారికి నిర్వహణ కమిటీ వారు బహుమతులు అందజేశారు.

గుండెపోటుతో ఉపాధ్యాయుడు మృతి

ప్రజాశక్తి-మార్టూరు రూరల్

గుండెపోటుతో ఉపాధ్యాయుడు మృతి చెందాడు. ఇంకొల్లు గ్రామానికి చెందిన వంకాయలపాటి శ్రీనివాస రావు(53) మండల పరిధిలోని రాజుగారిపాలెం ఎంపిపి పాఠశాలలో సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయుడిగా పని చేస్తూ మార్టూరులో నివాసం ఉంటున్నాడు. పాఠశాలకు సంక్రాంతి సెలవులు ఇవ్వడంతో ఇంకొల్లులో ఉంటున్న భార్య పిల్లల వద్దకు వెళ్లాడు. ఈ క్రమంలో గురువారం అర్ధరాత్రి ఒక్కసారిగా గుండెపోటుకు గురైన ఉపాధ్యాయుడిని సమీప వైద్యశాలకు తరలించగా అప్పటికే మృతి చెందారు. ఆయన మృతికి యూటీఎఫ్ మార్టూరు శాఖ అధ్యక్ష కార్యదర్శులు బండారు ఆదినారాయణ, పోపూరి సునీల్ కుమార్ సంతాపం తెలిపారు.


ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన దుర్గారావు

బైక్‌ను ఢీకొన్న లారీ

అన్నా చెల్లెళ్లకు తీవ్ర గాయాలు

ప్రజాశక్తి-మార్టూరు రూరల్

పండగ సెలవులకు బంధువుల ఇంటికి బైక్‌పై వెళుతున్న అన్నా చెల్లెళ్లను ఎదురుగా రాంగ్‌రూట్‌లో వస్తున్న లారీ ఢీకొన్న ప్రమాదంలో వారిద్దరూ తీవ్రంగా గాయపడిన ఘటన మార్టూరు-తాతపూడి మధ్య జాతీయ రహదారిపై శుక్రవారం చోటుచేసుకుంది. 108 సిబ్బంది నాగేశ్వరమ్మ తెలిపిన వివరాల ప్రకారం.. గుంటూరు పట్టణం శారద కానీకి చెందిన అల్లాడి దుర్గారావు తన చెల్లెలు తులసమ్మతో కలిసి ప్రకాశం జిల్లా దొనకొండలోని బంధువుల ఇంటికి సంక్రాంతి సెలవులు గడప డానికి బైక్‌పై వెళుతున్నారు. వీరు ప్రయాణిస్తున్న బైక్‌ని జాతీయ రహదారిపై రాంగ్ రూట్‌లో అతి వేగంగా వస్తున్న లారీ వీరి బైక్‌ని నిర్లక్ష్యంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఎగిరి కిందపడ్డ దుర్గారావు, తులసమ్మ తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను చిలకలూరిపేట, మార్టూరు 108 వాహనాల్లో గుంటూరు ప్రభుత్వ సమగ్ర వైద్యశాలకు తరలించారు. దుర్గారావు పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. కాగా బైక్‌ని ఢీకొట్టిన లారీ డ్రైవర్ అక్కడి నుంచి పారిపోయే ప్రయత్నం చెయ్యగా వెనుక వస్తున్న వాహనదారులు వెంబడించి లారీని ఆపి మార్టూరు పోలీస్ స్టేషన్‌కు తరలించారు. డేగర్లమూడి వద్ద నుంచి చిలకలూరిపేట వైపు వెళ్లడానికి అండర్ పాస్ బ్రిడ్జి లేకపోవడంతో తాతపూడి వైపు ప్రమాదకరంగా వాహనాలు వెళ్లడంతో పలు ప్రమాదాలు చోటుచేసుకుంటున్నప్పటికీ హైవే అధికారులు తమకెందుకులే అన్న నిర్లక్ష్య ధోరణితో వ్యవహరించడం గమనార్హం.

శాశ్వత ప్రమోషన్లు ఇవ్వాలి

ప్రజాశక్తి-బాపట్ల రూరల్

శాశ్వత ప్రమోషన్లు ఇవ్వకుండా అలవెన్స్ ప్రమోషన్ ఇవ్వటం దుర్మార్గ చర్య అని, ఈ విధానాన్ని రద్దు చేయాలని బాపట్ల జిల్లా ఫ్యాప్టో ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఈ మేరకు బాపట్ల డీఈఓ తరపున ఆఫీస్ సూపరింటెండెంట్‌కు మెమోరాండం ఇచ్చింది. శాశ్వత ప్రమోషన్స్ వెంటనే చేపట్టాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. విద్యా రంగానికి సంబంధించి ప్రభుత్వం విడుదల చేసే ప్రతి జీవో మెమో ప్రొసీడింగ్స్ అసంబద్ధంగా, అన్యాయంగా ఉన్నాయని ఫ్యాప్టో నిరసన తెలియజేసింది. ఈ కార్యక్రమంలో చైర్మన్ బీ శ్రీనివాస రావు, సెక్రెటరీ జనరల్ సిహెచ్‌టీవీ సురేష్, ట్రేసరర్ డీ ప్రసాదరావు, యూటీఎఫ్ నాయకులు మోహనరావు, ఎం వెంకటేశ్వరరెడ్డి, ఏపీటీఎఫ్ నాయకులు చాంద్‌బాషా, బిటిపిఎ నాయకులు గడ్డం ఏలీయా తదితర నాయకులు ప్రసంగించారు. ఇది మనకు నష్టం కలిగించే చర్య. దీన్ని విరమించుకోకపోతే రాబోయే రోజుల్లో చేపట్టే ఉద్యమంలో ఉపాధ్యాయులు అందరూ సంఘటితంగా పాల్గొనాలని ఫ్యాప్టో పిలుపునిచ్చింది.

ఆరోగ్యం పట్ల అప్రమత్తంగా ఉండాలి

రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వి కృష్ణయ్య

ప్రజాశక్తి-పంగులూరు

పేద ప్రజలు ఆరోగ్యం పట్ల అప్రమత్తంగా ఉండాలని రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు వి కృష్ణయ్య అన్నారు. శుక్రవారం గంగవరం గ్రామంలోని మంచాల వెంకటరామయ్య, రంగమ్మ కళ్యాణ మండపంలో జరిగిన బిపి, షుగర్ వైద్యసేవల ఉచిత రెగ్యులర్ మెడికల్ క్యాంపు సమావేశంలో ఆయన మాట్లాడారు. మాగిశెట్టి చంద్రమ్మ, తంగా రామాంజమ్మ, వెంకట నరసమ్మ, మద్దాల కృష్ణమూర్తి జ్ఞాపకార్థం కుటుంబ సభ్యులు మద్దాల రంగారావు, రంగమణి, సరళ, సహకారంతో ఈ క్యాంపును నిర్వహించారు. ఈ సందర్భంగా కృష్ణయ్య మాట్లాడుతూ, వైద్యం ఖరీదు అయిపోయిందని, పేదలు వైద్యం చేయించుకునే పరిస్థితులు లేవని అన్నారు. కార్పొరేట్ వైద్యశాలలో వైద్యం చేయించుకోవాలంటే అది ధనవంతులకే సాధ్యమని అన్నారు. ఈ పరిస్థితుల్లో పేదల



కార్యక్రమంలో మాట్లాడుతున్న రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వి కృష్ణయ్య

ఆరోగ్యాన్ని కాపాడేందుకు మంచి మందులు అందించేందుకు ముందుకు వచ్చి, రెండు నెలలకు ఒకసారి క్యాంపు నిర్వహిస్తున్న గంగవరం ఆరోగ్య సంక్షేమ వేదికకు ఆయన ధన్యవాదాలు తెలిపారు. ఇక్కడికి వచ్చే వారిలో ఎక్కువ శాతం రైతులు, వ్యవసాయ కూలీలు ఉన్నారని, వ్యవసాయం కాపాడుకునేందుకు జరిగే రైతు సంఘ పోరాటానికి ప్రజల సహకరించాలని ఆయన కోరారు. డాక్టర్ మంచాల రమేష్ మాట్లాడుతూ, ఎంతోమంది దాతలు ఈ మెడికల్ క్యాంపు నిర్వహించేందుకు సహకరిస్తున్నారని, వారందరికీ ధన్యవాదాలు తెలియజేశారు. ప్రజలు ఈ క్యాంపును ఉపయోగించుకొని ఆరోగ్యాలు కాపాడుకోవాలని, ఆందోళన చెందాల్సిన అవసరం ఏమీ లేదని అన్నారు. ఈ సభకు గంగవరం ఆరోగ్య సంక్షేమ వేదిక కన్వీనర్ కే బాలచంద్ర అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో డాక్టర్ జి సుబ్బారెడ్డి, గుంటూరు దంత వైద్య నిపుణులు డాక్టర్ కే రాజేంద్ర, ప్రజాసంఘాల నాయకులు ఎన్ బాబురావు తదితరులు ప్రసంగించారు. రోగులకు మందులు అందించడంలో మాదాల వెంకట్రావు, మాదాల అరుణ సహకరించారు.

కోడిపందేలు నిర్వహిస్తే కఠిన చర్యలు

డీఎస్పీ డాక్టర్ మహంతి కిషోర్ కుమార్

ప్రజాశక్తి-మార్కాపురం రూరల్



సంక్రాంతి పండుగ సందర్భంగా మార్కాపురం సబ్‌డివిజన్ వ్యాప్తంగా ఎవరైనా కోడిపందేలు, పేకాట తదితర అసాంఘిక కార్యక్రమాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని మార్కాపురం డిఎస్పీ డాక్టర్ మహంతి కిషోర్‌కుమార్ తెలిపారు. ప్రజాశక్తితో డీఎస్పీ కిషోర్ కుమార్ కోడిపందేలు, పేకాట, అసాంఘిక కార్యకలాపాల గురించి మాట్లాడుతూ సంక్రాంతి పండుగ సమీపిస్తున్న తరుణంలో ఇప్పటికే పేకాట, కోడి పందేలు, అసాంఘిక కార్యకలాపాలు నిర్వహించే స్థావరాలను గుర్తించామని అన్నారు. ఆ ప్రదేశాలలో ఎప్పటికప్పుడు పోలీస్ నిఘా ఉంటుందన్నారు. సబ్ డివిజన్ వ్యాప్తంగా గతంలో కోడి పందేలలో పాల్గొన్న వారిని గుర్తించి ప్రతి పోలీస్ స్టేషన్ల పరిధిలో రెవెన్యూ అధికారుల ఎదుట బైండోవర్ చేసి మరలా కోడి పందేలలో, ఇతర అసాంఘిక కార్యకలాపాలలో పాల్గొనకుండా కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. క్షేత్రస్థాయిలో పటిష్ట నిఘా ఏర్పాటు చేశామని, పేకాట, కోడి పందేలు, ఇతర అసాంఘిక కార్యకలాపాలలో ఎవరైనా పాల్గొంటే వారిని ఉపేక్షించేది లేదని అన్నారు. బైండోవర్ మీరి ప్రవర్తించిన వారిని న్యాయస్థానం ఎదుట హాజరు పరిచి చట్టపరంగా శిక్షలు విధించేలా చర్యలు తీసుకుంటామన్నారు. కోడి పందేలు, పేకాట వంటి ఇతర అసాంఘిక కార్యకలాపాలలో పాల్గొన్న వ్యక్తులు ఆర్థికంగా నష్టపోతారని, తద్వారా కుటుంబ కలహాలు వస్తుంటాయని అన్నారు. సులభంగా డబ్బులు సంపాదించడానికి దొంగతనాలు చెయ్యడానికి ఆస్కారం ఉంటుందని, వీటి వల్ల పరోక్షంగా శాంతి భద్రతలకు విఘాతం కలిగే అవకాశం వుంటుందన్నారు. కాబట్టి సబ్‌డివిజన్ ప్రజలకు మెరుగైన శాంతిభద్రతలు అందించడంలో ఏ చిన్న విషయంలో కూడా నిర్లక్ష్యం వహించమని, కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. అలాగే సబ్ డివిజన్ వ్యాప్తంగా ఈ నెల 31వ తేదీ వరకు సెక్షన్30, పోలీస్ యాక్ట్ అమలలో ఉంటుందని, దీని ప్రకారం పోలీసు అధికారుల అనుమతి లేకుండా సబ్ డివిజన్ ప్రజలు ధర్నాలు, రాస్తారోకోలు, నిరసనలు, ర్యాలీలు, పబ్లిక్ మీటింగ్‌లు, సభలు, సమావేశాలు నిర్వహించరాదని తెలిపారు. అలాగే ప్రజా ధనానికి నష్టం కల్గించే చట్ట వ్యతిరేక కార్యక్రమాలు చేపట్టరాదన్నారు. కాబట్టి జిల్లా ప్రజలు, ప్రజా ప్రతినిధులు, వివిధ సంఘాల నాయకులు తమకు ఈ విషయంలో సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

'సైకో పోవాలి-సైకిల్ రావాలి' పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-భట్టిప్రోలు

సైకో పోవాలి-సైకిల్ రావాలి అనే నినాదంతో టిడిపి ఆధ్వర్యంలో శుక్రవారం వేమూరు పార్టీ కార్యాలయంలో మాజీమంత్రి, టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు నక్కా ఆనంద బాబు, మాజీ ఎంఎల్‌ఏ ముమ్మనేని వెంకట సుబ్బయ్య పోస్టర్లు ఆవిష్కరించారు. తెనాలి, వేమూరు నియోజకవర్గాల పార్టీ విస్తృత స్థాయి సమావేశం తెనాలి పార్టీ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆనందబాబు మాట్లాడుతూ అన్ని గ్రామాలలో ప్రభుత్వం తీసుకువచ్చిన జిఓ నంబర్ 1 కాపీలను దగ్ధం చేయాలని పిలుపునిచ్చారు. ఈ నెల 18వ తేదీన ఎన్‌టిఆర్ వర్ధంతి సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించాలని సూచించారు. అనంతరం భట్టిప్రోలులో బిసి సెల్ నాయకులు బట్టు మల్లికార్జునరావుకు ఇటీవల రోడ్డు ప్రమాదం జరగటంతో ఆయనను పరామర్శించారు. నియోజకవర్గ నాయకులు అనుబంధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలు ప్రారంభం

ప్రజాశక్తి-పంగులూరు

రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలను పంగులూరులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో, శుక్రవారం సాయంత్రం వైసీపీ అద్దంకి నియోజకవర్గం ఇన్‌ఛార్జి శాప్ నెట్ చైర్మన్, బాచిన కృష్ణ చైతన్య ప్రారంభించారు. మొదటిసారిగా బీకేసి పంగులూరు, వర్సెస్ పావులూరు టీం మధ్య పోటీ జరిగింది. ఈ సందర్భంగా కృష్ణ చైతన్య మాట్లాడుతూ, సంక్రాంతి పండుగ సందర్భంగా ఇలాంటి పోటీలు జరపటం ఆనందించదగ్గ విషయమని చెప్పారు. పంగులూరులో సంక్రాంతికి పలు రకాల ఆటల పోటీలు నిర్వహించటం సాంప్రదాయమని, గతం నుంచి ఇది కొనసాగుతోందని చెప్పారు. ఎడ్ల పోటీలు, పొట్టేళ్ల పోటీలు, కబడ్డీ పోటీలు, పరుగు పందేలు మొదలైన పోటీలు జరుగుతూ ఉండేవని చెప్పారు. క్రీడా పోటీలకు పంగులూరు గ్రామ ప్రజలు ఎంతగానో సహకరిస్తారని, ఈ ప్రాంతంలో పోటీల నిర్వహణలో మంచి పేరు ఉందని చెప్పారు. ఆ



కబడ్డీ పోటీలను ప్రారంభిస్తూ క్రీడాకారులను పరిచయం చేసుకున్న బాచిన కృష్ణ చైతన్య

పేరు నిలబెట్టుకుంటూ ఇప్పుడు కూడా కబడ్డీ పోటీలు నిర్వహించటం సంతోషంగా ఉందన్నారు. క్రీడాకారులు ఉత్సాహంగా, ఉల్లాసంగా ఆటలు ఆడాలని, బహుమతులు సాధించి మంచి పేరు తీసుకురావాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పిటిసి బాచిన చెంచు ప్రసాద్, ఎంపీపీ తేళ్ల నాగమ్మ, జడ్పిటిసి రాయిని ప్రమీల, మండల అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు రాయిని వెంకటసుబ్బారావు, పలు గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు, వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సంక్రాంతి కానుక ఏదీ?

జగన్‌రెడ్డి పాలనలో పేదలకు సంతోషం దూరం ● ధరల వాత, పన్నుల మోతతో ఉక్కిరిబిక్కిరి ● అద్దంకి ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్

ప్రజాశక్తి-అద్దంకి

గత ప్రభుత్వం చంద్రన్న సంక్రాంతి కానుక ఇచ్చేదని, ప్రస్తుతం అలాంటి కానుకలు ఎందుకు ఇవ్వడం లేదని అద్దంకి ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ ప్రశ్నించారు. పండుగ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగన్మోహన్ రెడ్డి అధికారంలోకి వచ్చినప్పటి నుంచి పేదలకు సంతోషం దూరమైందని అన్నారు. భోగి పండుగ భోగభాగ్యాలు కేవలం తన అనుయాయులకు మాత్రమే దక్కుతున్నాయి తప్ప రాష్ట్ర ప్రజలకు చేసిందేమీ లేదని అన్నారు. ప్రభుత్వ ఖజానాలో నుంచి పది రూపాయలు సామాన్యుడికి పథకాల రూపంలో ఇచ్చి ధరలు పన్నులు, చార్జీల పెంపుతో వంద రూపాయలు ప్రజల జేబులోంచి కాజేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తన దోపిడీని కప్పిపుచ్చుకునేందుకు ప్రభుత్వ ప్రకటనలు, అబద్ధపు ప్రచారాలతో రాష్ట్ర ప్రజల కళ్లు కప్పుతున్నాడని దుయ్యబట్టారు. వైసిపి అధికా రంలోకి వచ్చినప్పటి నుంచి రాష్ట్ర ప్రజలకు సుఖసంతోషాలు, పండుగ ఆనందాలు మసకబారాయన్నారు. భోగి పండుగ సమ యంలో పంట చేతికొచ్చిన రైతులు ఆనందం గా సంక్రాంతి సంబరాలు జరుపుకునే వారని గుర్తు చేశారు. కానీ ఈ సైకో పాలనలో రైతులు నష్టాలపాలై ఆత్మహత్యలకు పాల్పడు తున్న దుర్ఘటనలు మనం కళ్లారా చూస్తున్నామని అన్నారు. రైతులకు మద్దతు ధర లేదు, బకాయిలు నెలలు తరబడి పెండింగ్, పంట పండించడా నికి చేసిన అప్పుల భారం పెరిగి వడ్డీలు కట్టడానికి కూడా పంట డబ్బులు



సరిపోవడం లేదంటే జగన్‌రెడ్డి పాలన ఏ విధంగా ఉందో సంక్రాంతి రోజు రైతు ఇంటికి వెళ్లిచూస్తే తెలుస్తుందని అన్నారు. సైకో పాలనలో ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తూ నిర్బంధాలను పెంచుతూ తన దోపిడీ, రౌడీ పాలనను నిలబెట్టుకోవాలనే కుట్రతో తెచ్చిన జీవో నెంబర్-1, ఇతర నల్లజీవోలను అద్దంకి నియోజకవర్గ వ్యాప్తంగా అన్ని మండల కేంద్రాలలో, గ్రామాలలో నేతలు భోగి మంటలలో నల్లజీవోల ప్రతులను తగుల పెట్టాలని కోరారు. వచ్చే ఎన్నికల్లో రౌడీ పాలన భోగి మంటల్లో తగలబెట్టి, చంద్రన్న పాలనను స్వాగతిద్దామని నియోజకవర్గ ప్రజలకు ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ పిలుపునిచ్చారు.

ఐక్య పోరాటాలతోనే సమస్యల పరిష్కారం

ప్రజాశక్తి-భట్టిప్రోలు

ఐకమత్యంగా ఉండి పోరాడితేనే సమస్యలు పరిష్కారం అవుతాయని సిఐటియు మండల కార్యదర్శి జి సుధాకర్ అన్నారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అంగన్‌వాడీ కార్యకర్తలతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంగన్‌వాడీలపై రాజకీయ వేధింపులు పెరిగాయన్నారు. కార్యకర్తలకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, సుప్రీంకోర్టు గైడ్ లైన్ ప్రకారం గ్రాట్యూటీ అందించి ఫేస్ యాప్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమస్యల పరిష్కారానికై ఈ నెల 24,25 తేదీలలో ఐసిడిఎస్ ప్రాజెక్ట్ కార్యాలయం వద్ద మరియు ఫిబ్రవరి 6వ తేదీ జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద జరిగే ధర్నాను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ సభ్యులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సిపిఎం నాయకులు కె శంకర్, ఐద్వా జిల్లా అధ్యక్షురాలు షమ్మీ

'ఐక్యత కొరకు ఆటలు మైత్రికి బాటలు'

ప్రజాశక్తి-పామూరు

సంక్రాంతి సంబరాలు పేరుతో ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఇనిమెర్ల గ్రామంలో ముగ్గుల పోటీ, మ్యూజికల్ చైర్స్ పోటీలు నిర్వహించారు. గెలుపొందినవారికి బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షురాలు సయ్యద్ షమ్మీ మాట్లాడుతూ కులాల మతాలకు అతీతంగా ప్రజలందరూ ఒకచోటకు చేరి ఐకమత్యంతో క్రీడ సంబరాలు జరుపుకోవాలని, చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని అన్నారు. గెలుపొందిన క్రీడాకారులకు బహుమతులు మండల అధ్యక్షులు భానుమతి, గ్రామ పెద్దలు జయరావు, తిరుపతయ్య, రామారావు, ఐద్వా నాయకురాలు నాంచారమ్మ, మదారమ్మ, కాదరున్నీసా, మస్తాన్‌బి, కొండమ్మ, ధనలక్ష్మి, జన విజ్ఞాన వేదిక నాయకులు శంకర్, కొండస్వామి తదితరులు అందజేశారు.



కేక్ కట్ చేస్తున్న దృశ్యం

ఘనంగా శివరామకృష్ణ జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి-రేపల్లె

నల్లూరిపాలెం చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు వీరవల్లి శివరామకృష్ణ జన్మ దినోత్సవ వేడుకలు శుక్రవారం నల్లూరిపాలెం గ్రామంలో ఘనంగా నిర్వహించారు. 20కేజీల కేక్‌ను శివరామకృష్ణ కట్ చేసి అందరికీ పంచారు. అభిమానులు పెద్దఎత్తున పాల్గొని ప్రత్యేకంగా కలిసి పుష్పగుచ్ఛాలు ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు. శివరామకృష్ణ మరెన్నో పుట్టినరోజులు జరుపుకోవాలని, రాజకీయంగా మరెన్నో ఉన్నత పదవులు చేపట్టాలని వారు ఆకాంక్షించారు. అభినందనలు తెలిపిన వారందరికీ ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బేతపూడి కిరణ్, శివరామకృష్ణ అభిమానులు పాల్గొన్నారు.

రైతు భరోసా కేంద్రంలో తనిఖీ

ప్రజాశక్తి-పెద్దారవీడు

పెద్దారవీడు మండల వ్యవసాయ అధికారి కె బుజ్జిబాయి మండలంలోని గొబ్బూరు రైతు భరోసా కేంద్రంలో శుక్రవారం తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. అనంతరం గ్రామంలో శనగ పంటలో నిర్వహించిన పొలంబడి కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి కె బుజ్జిబాయి మాట్లాడుతూ శనగ పంటలో వచ్చే పురుగు మరియు తెగుళ్ల వాటి నివారణ చర్యలు రైతులకు వివరించారు. శనగ పంటలో ఎటువంటి సస్యరక్షణ చర్యలు చేపట్టాలో రైతులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో బోర్డు చైర్మన్ అన్నపురెడ్డి వెంకటరెడ్డి, బోర్డు మెంబర్స్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

సాంప్రదాయ పండుగ సంక్రాంతి : కలెక్టర్

కార్పొరేషన్ కార్యాలయంలో అంబరాన్నంటిన సంబరాలు

ప్రజాశక్తి - ఒంగోలు సబర్బన్

మన జీవన శైలితో ముడిపడిన సంప్రదాయ పండుగ సంక్రాంతిని ప్రజలందరూ సుఖ సంతోషాలతో జరుపుకోవాలని జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్ తెలిపారు. ఒంగోలు కార్పొరేషన్ కార్యాలయంలో సంక్రాంతి సంబరాలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఎస్‌పి మల్లిక గర్గ్, కలెక్టర్ ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పాత ఆలోచనలు, దు:ఖాన్ని వదిలేసి సరికొత్త ఆశలు, ఆకాంక్షలకు ప్రతీకగా సంక్రాంతి పండుగలను జరుపుకుంటామన్నారు. ముఖ్యంగా రైతు కష్టానికి ప్రతిఫలంగా ధాన్యపు బస్తాలు వారి ఇంటికి చేరే ఈ పండుగతో వ్యవసాయ, వ్యవసాయేతర కుటుంబ బాలకు కూడా



సంక్రాంతి వేడుకల్లో కలెక్టర్, మేయర్, కమిషనర్

అవినాభావ సంబంధం ఉంటుందన్నారు. తాను కూడా వ్యవసాయ నేపథ్యమున్న కుటుంబం నుంచే వచ్చానని చెప్పారు. ప్రకృతితో మమేకమయ్యే ఈ సంప్రదాయ పండుగను ప్రతి ఒక్కరూ ఆనందంతో జరుపుకోవాలని ఆకాంక్షించారు. ఎస్‌పి మల్లికా గర్గ్ మాట్లాడుతూ మనిషిని ప్రకృతితోనూ, వ్యవ సాయంతోనూ అనుసంధానం చేసే అతిపెద్ద పండుగ సంక్రాంతి అని చెప్పారు. వ్యవసాయం బాగుండాలంటే ప్రకృతిని కాపాడు కోవాలని, ఆ బాధ్యత మనందరిపైన ఉందని చెప్పారు. ఆ దిశగా జీవన శైలి మార్పు కోవాలని ఆమె పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా మహిళలు తీర్చిదిద్దిన రంగవల్లులు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. కలెక్టర్ , ఎస్‌పి రంగవల్లులను ఆసక్తిగా తిలకించారు. నృత్యాలు, సాంస్కృతిక ప్రదర్శనలు, కోలాటం, గంగిరెద్దు విన్యాసాలతో సంబరాలు మిన్నంటాయి. భోగిమంటలు ప్రారంభించి బిసిడిఎస్ ఆధ్వర్యంలో తయారు చేసిన తెలుగు సంప్రదాయ పిండి వంటలను కలెక్టర్, ఎస్‌పి రుచి చూసి ప్రశంసించారు. మేయర్ గంగాడ సుజాత ఆధ్వర్యంలో జరిగిన సంక్రాంతి సంబరాల్లో ఉద్యోగులు, సిబ్బంది, నగర ప్రజలు, కమిషనర్ వెంకటేశ్వరరావు, డిప్యూటీ మేయర్ వెలనాటి మాధవరావు, మున్సిపల్ ఉద్యోగులు, పలువురు కార్పొరేటర్లు పాల్గొన్నారు.


ముగ్గులను తిలకిస్తున్న ఇఒ వరదారెడ్డి

ముగ్గుల పోటీలు

ప్రజాశక్తి -ఒంగోలు కలెక్టరేట్

సంక్రాంతి సందర్భంగా దేవదాయ ధర్మదాయ శాఖ, కొప్పోలు ఊరచెరువు ఆధ్వర్యంలో మహిళలకు శుక్రవారం ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ పోటీలను చెన్నకేశవస్వామి ఆలయ ఇఒ వరదారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా వరదారెడ్డి మాట్లాడుతూ సంక్రాంతి పండుగ సందర్భంగా విద్యార్థులకు వివిధ రకాల పోటీలు నిర్వహించినట్లు తెలిపారు. రైతులకు ట్రాక్టర్ ట్రక్కులతో రివర్స్ పోటీలు నిర్వహించినట్లు తెలిపారు. ముగ్గుల పోటీల్లో ప్రథమ బహుమతిని బత్తల సుశీల, బత్తల మహేశ్వరి, ద్వితీయ బహుమతిని శింగమనేని తిరుమల శ్రీ, తృతీయ బహుమతిని తిరుమల శెట్టి వెంకట సుభాషిణి సాధించారు. ఈ కార్యక్రమంలో ఆలయ సిబ్బంది శ్రీనివాసరావురెడ్డి, దివి రామయ్య, గ్రామస్తుడు కోనంకి హనుమంతరావు పాల్గొన్నారు. **నాగులుప్పలపాడు :** సంక్రాంతి పండుగ సందర్భంగా మండల పరిధిలోని ఉప్పుగుండూరులో సంతూర సహకారంతో వాసవీక్లబ్ ఆధ్వర్యంలో నాగులుప్పలపాడు ,ఇంకొల్లు, కొరిశపాడు, చిన్నగంజాం మండలాల స్థాయిలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈపోటీల్లో 50 మంది మహిళలు పాల్గొన్నారు ఈ సందర్భంగా ఎంపిపి నమలపు అంజమ్మ మాట్లాడుతూ మహిళలు వంటగదికే పరిమితం కాకుండా అన్నిరంగాల్లో ముందుండాలన్నారు. ముగ్గుల పోటీలకు న్యాయనిర్ణేతలుగా మిరియాల నీరజ, కుప్పం ప్రసన్న, చుండూరి గాయత్రి వ్యవహరించారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో వాసవీక్లబ్ ఇంటర్ నేషనల్ ఉపాధ్యక్షుడు కొంజేటి వెంకట సురేష్ బాబు, జడ్‌పిటిసి యాదాల రత్నభారతి, వాసవీక్లబ్ మహిళా గవర్నర్ ఉమా అన్నపూర్ణ, వైసిపి నాయకులు నమలపు కష్టారెడ్డి, ఆరోగ్యశ్రీ ప్రత్యేకాధికారి యాదాల అశోక్ ,వైసిపి గ్రామ అధ్యక్షుడు మాదాసు రాంబాబు, వాసవీక్లబ్ సభ్యులు అమరా వేణు, దేసు సుధాకర, పులకం రాజేష్ పాల్గొన్నారు.

కబడ్డీ పోటీలు ప్రారంభం

ప్రజాశక్తి - ముండ్లమూరు

క్రీడా కారులు గెలుపోటములను సమానంగా స్వీకరించాలని మద్దిశెట్టి శ్రీధర్ తెలిపారు. సంక్రాంతి పండుగ భాగంగా మండలంలోని వేముల గ్రామంలో జిల్లా స్థాయి కబడ్డీ పోటీలను శుక్రవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి సుంకర సునీత బ్రహ్మ నందరెడ్డి, జడ్‌పిటిసి రత్నరాజు, వైసిపి నాయకులు జయంతి, రామ మునసలారెడ్డి, నాయకులు సుబ్బారెడ్డి, పిచ్చయ్య, కృష్ణయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

స్కీమ్ వర్కర్లను..

ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని వినతి

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

స్కీమ్ వర్కర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని ఎపి అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ జిల్లా నాయకులు కోరారు. ఈ మేరకు ఎంపీ మాగుంట కార్యాలయంలో ఎంపీ పిఎ ఓ.రామకృష్ణను కలిసి శుక్రవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా కార్యదర్శి ఈదర అన్నపూర్ణ మాట్లాడుతూ స్కీమ్ వర్కర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలన్నారు. కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలన్నారు. 45వ లేబర్ కాన్ఫరెన్స్ సిఫార్సు మేరకు కనీస వేతనాలు ఇవ్వాలన్నారు. స్కీమ్ వర్కర్ల సమస్యలు, కనీస వేతనాలపై ఎంపీ మాగుంట శ్రీనివాసులు రెడ్డి పార్లమెంట్‌లో మాట్లాడి కనీస వేతనాలు అమలయ్యేలా


వినతి పత్రం అందజేస్తున్న ఆశా వర్కర్లు

చర్యలు చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆశా వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి పి.కల్పన, అంగన్‌వాడీలు, ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల హక్కుల కోసం పోరాటాలు : సిఐటియు

ప్రజాశక్తి-దర్శి

ఈనెల 18 నుంచి 22 వరకు బెంగుళూరులో నిర్వహిస్తున్న సిఐటియు అఖిల భారత మహాసభలను జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు తాండవ రంగారావు కోరారు. అఖిల భారత మహాసభలను జయప్రదం చేయాలని కోరుతూ సిఐటియు జెండాను మండల అధ్యక్షుడు కాలేబాష శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా తాండవ రంగారావు మాట్లాడుతూ కార్మికుల హక్కుల కోసం సిఐటియు పోరాటాలు చేస్తున్నట్లు తెలిపారు. కేంద్రంలో బిజెపి ప్రభుత్వం కార్మికులు పోరాడి సాధించుకున్న చట్టాలను రద్దు చేసిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి ఉప్ప నారాయణ, నాయకులు గోగు వెంకయ్య, ఈమని నాగేశ్వరరావు,


సిఐటియు జెండాను ఆవిష్కరిస్తున్న నాయకులు

కోటేశ్వరరావు, ఆంజనేయులు, శ్రీనివాసరావు, ఆదెయ్య, రవితేజ, సివిల్ సప్లయి, ముఠా, ఆటో, భవన నిర్మాణ రంగ కార్మికులు పాల్గొన్నారు.

వెంకటరత్నం సేవలు చిరస్మరణీయం : యుటిఎఫ్

ప్రజాశక్తి-పొదిలి

ఉపాధ్యాయుడు మైనేని వెంకట రత్నం సేవలు చిరస్మరణీయమని యుటిఎఫ్ నాయకులు, విశ్రాంత ఉపాధ్యాయుడు, పొదిలి తాలూకా పెన్షనర్ల సంఘం కార్యదర్శి ఏ బాదుల్లా తెలిపారు. మైనేని వెంకటరత్నం 33వ వర్ధంతి స్థానిక యుటిఎఫ్ ప్రాంతీయ కార్యా లయంలో శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్ర మంలో యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి అబ్దుల్ హై, జిల్లా ఆడిట్ కమిటీ సభ్యుడు బుజ్జిబాబు, కొనకనమిట్ల ప్రధాన కార్యదర్శి గోనేశ్రీనివాసులు, పొదిలి మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు బాల కాశిరెడ్డి, నాగార్జున రావు, జిల్లా కౌన్సిలర్ శ్రీనివాసులు రెడ్డి, కోణంకి సంజీవరావు,


వెంకట రత్నం చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

సీతారామయ్య, గుంటూరు ఐజా బాబు, చంద్రమౌళి, సత్యనారాయణ రెడ్డి, నారాయణ రెడ్డి, హరిబాబు, పుత్తూరు రమేష్ పాల్గొన్నారు.

మాగుంట సంక్రాంతి శుభాకాంక్షలు

ఒంగోలు కలెక్టరేట్ : జిల్లా ప్రజలకు ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులు రెడ్డి భోగి, సంక్రాంతి శుభాకాంక్షలను తెలియజేశారు. జిల్లా ప్రజలు కోవిడ్ జాగ్రత్తలు పాటించుచూ భోగి మంటలతో, ముగ్గులతో, ఆటపాటలతో ఈ సంక్రాంతి పండుగను మూడు రోజులు ఎంతో ఆనందంగా జరుపుకోవాలని ఆయన ఆకాంక్షించారు.

బాలినేని శుభాకాంక్షలు

ఒంగోలు సబర్బన్ : జిల్లా ప్రజలకు, ప్రజాప్రతినిధులు, అధికారులు, కార్మికులు, కర్షకులు, ఉద్యోగులు, ఉపాధ్యాయులకు, పార్టీ నాయకులు, కార్యకర్తలకు, పాత్రికేయులకు మాజీ మంత్రి, రీజనల్ కో ఆర్డినేటర్, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి శుక్రవారం ఓ ప్రకటనలో సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. అందరూ ఆనందంగా సంక్రాంతి పండుగను జరుపుకోవాలని ఆయన ఆకాంక్షించారు.

ఈవిఎంల భద్రతకు చర్యలు : కలెక్టర్

ఒంగోలు కలెక్టరేట్ : ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల భద్రతకు అన్ని చర్యలూ తీసుకుంటున్నట్లు కలెక్టర్ దినేష్ కుమార్ తెలిపారు. త్రైమాసిక తనిఖీలలో భాగంగా మామిడి పాలెంలోని ఈవిఎం గోదాములను శుక్రవారం కలెక్టర్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన ఓటింగ్ యంత్రాలను భద్రపరిచిన తీరును పరిశీలించారు. ఈ కార్యక్రమంలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

మంత్రి సురేష్‌కు సన్మానం

యర్రగొండపాలెం : స్థానిక కొలుకుల రోడ్డులో యర్రగొండపాలెం ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం ఆధ్వర్యంలో రూ. 40 లక్షల వ్యయంతో ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్‌కు సంబంధించిన పెట్రోల్ బంకును ఏర్పాటు చేయనున్నారు. అందుకు అవసరమైన అన్ని అనుమతులు వచ్చాయి. ఈ సందర్భంగా సొసైటీ ప్రెసిడెంట్ మేడం వెంకటరెడ్డి, పిడిసిఐసి బ్యాంక్ సిబ్బంది, ఇతర నాయకులు శుక్రవారం మంత్రి సురేష్‌ను కలిసి సన్మానించారు. ఈ కార్యక్రమంలో సొసైటి ప్రెసిడెంట్ మేడం వెంకటరెడ్డి, ఎఎంసి మాజీ చైర్మన్ ఒంగోలు మూర్తిరెడ్డి, వైసిపి మండల కన్వీనర్ కొప్పర్తి ఓబుల్‌రెడ్డి,సొసైటీ సిఇఒ సయ్యద్ అహమ్మద్, ఎసిఒ రంగయ్య పాల్గొన్నారు.


మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాదరెడ్డి

బహుమతులు అందజేత

దర్శి : సంక్రాంతి పండుగ సందర్భంగా కళాంజలి ఈవెంట్స్ వారి ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా జబర్దస్త్ టీమ్ సందడి చేసింది. బుల్లెట్ భాస్కర్, హరిత, నరేష్, జితేంద్ర తమ స్కిట్లతో అందరిని ఆకట్టుకున్నారు. ఈ సందర్భంగా జిల్లాపరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి తెలిపారు. సంక్రాంతి పండుగ సందర్భంగా ముగ్గుల పోటీలు నిర్వహించడం, జబర్దస్త్ టీమ్ సందడి చేయడం అభినందనీయమని తెలిపారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో సోము దుర్గారెడ్డి, షేక్ కార్పొరేషన్ డైరెక్టర్ డాక్టరు ఎస్ఎం.బాషా, రమేష్, లక్ష్మిరెడ్డి, శ్రీనివాసరెడ్డి, ప్రేమ్‌కుమార్, జూపల్లి కోటేశ్వరరావు పాల్గొన్నారు.

సచివాలయ కన్వీనర్ల మండల అధ్యక్షుడిగా సుబ్బారెడ్డి

కురిచేడు : సచివాలయ కన్వీనర్ల మండల అధ్యక్షుడిగా మాజీ ఎంపిపి మేరువ సుబ్బారెడ్డి నియమితులయ్యారు. తన నియమకానికి కృషి చేసిన ఎమ్మెల్యే మద్దిశెట్టి వేణుగోపాల్‌కు ఈ సందర్భంగా సుబ్బారెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.



వరుస దొంగతనాలపై నిఘా

- శివారు ప్రాంతాల్లో కార్డన్ సెర్చ్
- పత్రాలు లేని వాహనాలు స్వాధీనం

ప్రజాశక్తి-మార్కాపురం

మార్కాపురంలో ఇటీవల వరుస చోరీలు జరుగుతున్న నేపథ్యంలో ప్రజల్లో భయం నెలకొంది. తాళం వేసి... ఇంట్లో ఎవరూ లేకుండా ఊర్లకు వెళ్లిన ఇళ్లను దొంగలు టార్గెట్‌గా చేసుకుంటున్నారు. ప్రస్తుతం రాత్రుల్లో చలి పెరిగిపోవడంతో జనాలు ఇళ్లలో తలుపులు బిగించుకుని నిద్రిస్తున్నారు. అర్ధరాత్రి సమయంలో వీధుల్లో పోలీసుల గస్తీ తప్ప మరెవ్వరూ కనిపించరు. దొంగలు చలి కాలాన్ని ఎంచుకుని వారనుకున్న పనిని సులువుగా చేసుకుంటున్నారు. పగటి పూట రెక్కీ నిర్వహించి. రాత్రి సమయంలో చోరీకి పాల్పడుతున్నారు.



ప్రజలతో మాట్లాడుతున్న సిఐ భీమానాయక్

వరుస దొంగతనాలపై పోలీస్ శాఖ దృష్టి సారించింది. ఎస్‌పి మల్లిక గర్గ్ కూడా ఈ వరుస దొంగతనాలపై ఆరా తీశారు. చోరీలు తక్షణమే కట్టడి చేయాలని, నిందితులను పట్టుకునే విధంగా పోలీస్ వ్యవస్థ పనిచేయాలని ఆదేశించారు. దీంతో నిందితుల కోసం పోలీసులు ప్రత్యేక బృందాలుగా ఏర్పడి గాలింపు చేపట్టారు. పట్టణంలోనూ రాత్రివేళ గస్తీ పెంచారు.

శుక్రవారం తెల్లవారు జామున పట్టణంలోని శివారు ప్రాంతాల్లో కార్డన్ సెర్చ్ పేరుతో పోలీసులు జల్లెడ పట్టారు. డిఎస్‌పి డాక్టర్ ఎం.కిశోర్‌కుమార్, సిఐ ఎం.భీమానాయక్ సారథ్యంలో మార్కాపురం పట్టణ ఎస్‌ఐలు శశికుమార్, సువర్ణ, రూరల్ ఎస్ఐ ఆర్.సుమన్, డివిజన్ పరిధిలోని పలువురు ఎస్‌ఐలు, పోలీసు బలగాలతో గాలింపు చేపట్టారు. ఈ సందర్భంగా కొందరు అనుమానితులను అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. పత్రాలు లేని 36 ద్విచక్ర వాహనాలను పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

పుస్తకాలు పంపిణీ

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

యర్రగొండపాలెం, పుల్లలచెరువు మండలాల్లో 40 గ్రామాల్లో చదువుకుంటున్న విద్యార్థులకు షార్ప్ సంస్థ మరియు చిల్డ్రన్ బిలీవ్ వారి సహాయ సహకారాలతో నోట్ పుస్తకాలు, పలకలు, పెన్నులు,పెన్సిళ్లు, కాపీరైట్ బుక్స్, రబ్బర్లు, స్కేళ్లు శుక్రవారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఇఒ ఆంజనేయులు. షార్ప్ సంస్థ పిఎం మహేష్, ఎస్ఎస్ఒ మందా మరనియబాబు, సిఎఫ్‌సిఎస్ అంకన్న, సుప్రియ, మార్తమ్మ, ధర్మానాయక్, గురవయ్య, అంగన్‌వాడీలు, విద్యార్థులు పాల్గొన్నారు.

సచివాలయం సందర్శన

ప్రజాశక్తి- అర్ధవీడు

అర్ధవీడు తహశీల్దారు కార్యాలయాన్ని మార్కాపురం సబ్ కలెక్టర్ సేతు మాధవన్ శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా సబ్‌కలెక్టర్ పలు రికార్డులను పరిశీలించారు. అనంతరం పాపినేని పల్లె సచివాలయం, అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్, రవిబాబు, ఎంపిడిఒ వీరభద్రాచారి, భూముల రీసర్వే డిటీ షేక్ నాయబ్ రసూల్, డిప్యూటీ తహశీల్దారు వెంకటేశ్వర్లు, రెవెన్యూ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు. **టంగుటూరు :** సచివాలయ వైద్య సిబ్బంది తమ పరిధిలోని ఇంటింటికీ వెళ్లి రోగులను గుర్తించి తగు చికిత్స అందించాలని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ రాజ్యలక్ష్మి తెలిపారు. మండల పరిధిలోని మర్లపాడు సచివాలయాన్ని శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా డాక్టర్ రాజ్యలక్ష్మి పలు రికార్డులను పరిశీలించారు. గర్భిణులచ, చిన్న పిల్లల టీకాల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఫ్యామిలీ ఫిజిషియన్ పథకంలో భాగంగా రోగులను గుర్తించి వారికి ద్వారా తగు చికిత్స అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపవైద్యాధికారి మాధవిలత, టంగుటూరు వైద్యాధికారి అశోక్, సిహెచ్ఒ డిఎస్.వెంకటేశులు, క్షేత్రస్థాయి వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఆలయంలో అన్నదానం

ప్రజాశక్తి - గిద్దలూరు

గిద్దలూరు పట్టణంలోని వీరన్న బావి సమీపంలోనున్న శ్రీకాళికాంబ దేవస్థానంలో దాతల సహకారంతో శుక్రవారం అన్నదానం నిర్వహించారు. ప్రతి శుక్రవారం దాతల సహకారంతో అన్నదానం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకుడు పాల్వాది నరేంద్రా ఆచారి, దండూరి నడిపిసోమయ్య, యోగా టీచర్ నారాయణరెడ్డి, దగ్గుపాటి జయరాములు, కాశయ్య, హరి తదితరులు పాల్గొన్నారు

తాగునీటి పైపులైన్‌కు మరమ్మతులు

టంగుటూరు : ప్రజలు తాగునీటికి ఇబ్బందులు పడకుండా సత్వర చర్యలు చేపడుతున్నట్లు సర్పంచి మద్దిరాల మమత పేర్కొన్నారు. రైల్వే మూడో లైన్ పనులు నిర్వహిస్తున్న నేపథ్యంలో పంచాయతీకి సరఫరా చేసే మంచినీటి పైపులైను పగిలిపోయింది. సర్పంచి మద్దిరాల మమత, కార్యదర్శి జగదీష్ బాబు ఆధ్వర్యంలో పగిలిన పైపులైన్‌కు శుక్రవారం మరమ్మతులు చేపట్టారు. శుక్రవారం సాయంత్రం నుంచి ప్రజలకు తాగునీటిని సరఫరా చేస్తున్నట్లు సర్పంచ్ మద్దిరాల మమత తెలిపారు.

నేడు 'సంఘం శరణం గచ్ఛామి'

ప్రజాశక్తి-టంగుటూరు

మండల పరిధిలోని ఆలకూరపాడులో శనివారం బ్లూ వింగ్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న సంఘం శరణం గచ్ఛామి నాటక ప్రదర్శనను జయప్రదం చేయాలని బ్లూవింగ్స్ ఫౌండేషన్ ముఖ్య సలహాదారు శివరామకృష్ణ రావు పేర్కొన్నారు. ఆలకూరపాడులో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అంబేద్కర్ ఆశయాలను ప్రజల్లోకి తీసుకెళ్లడమే లక్ష్యంగా ఈ నాటకాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత ఐఎఎస్ పిఎస్ఎన్.మూర్తి, ద్రవిడ దేశం నాయకుడు కష్టారావు తదితర ప్రముఖులు హాజరవుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ నెల్లూరు జిల్లా కమిటీ సభ్యులు కూరపాటి విజయరావు, గ్రామ మాజీ సర్పంచి మట్టిగుంట సురేష్, విగ్రహ కమిటీ సభ్యులు టి.దేవసహాయం, ఎం.సునీల్, కె.ఆంజనేయులు, బి.శ్రీను, లకంతోటి వినయ్ దాసి పాల్గొన్నారు.

మిర్చి రైతులకు నష్టపరిహారం చెల్లించాలి

రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు గాలి వెంకటరామిరెడ్డి

ప్రజాశక్తి-మార్కాపురం రూరల్

మిర్చి పంట సాగు చేసిన రైతులకు తీవ్ర నష్టం వాటిల్లిందని, రాష్ట్ర ప్రభుత్వం స్పందించి దెబ్బతిని పంటను సర్వే చేసి ఎకరానికి లక్ష రూపాయల నష్టపరిహారం అందించాలని ఎపి రైతు సంఘం పశ్చిమ ప్రకాశం జిల్లా అధ్యక్షుడు గాలి వెంకటరామిరెడ్డి, సిపిఎం నాయకులు దగ్గుపాటి సోమయ్య కోరారు. మండల పరిధిలోని పలు గ్రామాల్లో ప్రతినిధి బృందం మిర్చి పొలాలను శుక్రవారం సందర్శించారు. కల్లాల్లో ఉన్న మిర్చిని పరిశీలించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ మిర్చి పంటకు వైరస్ సోకి కాపు వచ్చే దశలో పంట పూర్తిగా దెబ్బతిన్నట్లు తెలిపారు. రైతులు ఎకరానికి లక్ష రూపాయల పెట్టుబడి పెట్టినట్లు తెలిపారు. తీరా చేతి కొచ్చిన వైరస్ కారణంగా పంట దెబ్బతినడంతో రైతులకు అప్పుల ఊబిలో కూరుకు పోయినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు గంగిరెడ్డి రాజశేఖర్‌రెడ్డి, మాలపాటి పోలిరెడ్డి, యేర్వ పాపిరెడ్డి, ఎన్. వెంకటేశ్వర్‌రెడ్డి, రైతులు బ్రహ్మేశ్వ రరెడ్డి, ఆదినారాయణరెడ్డి, షేక్ మాహబూబ్‌బాషా తదితరులు పాల్గొన్నారు.



మిర్చిని పరిశీలిస్తున్న నాయకులు

ఉపాధి పనులు పరిశీలన

ప్రజాశక్తి-మార్కాపురం రూరల్

పని అడిగిని ప్రతి కూలీకి ఉపాధి హామీ పథకం ద్వారా పనులు కల్పించాలని డ్వామా ప్రాజెక్టు డైరెక్టర్ కె.శీనారెడ్డి తెలిపారు. మండల పరిధిలోని గోగులదిన్నె గ్రామంలో ఉపాధిహామీ పథకం ద్వారా నిర్వహిస్తున్న పూడికతీత పనులను శుక్రవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పీడీ మాట్లాడుతూ పని ప్రదేశంలో కూలీలకు అధికారులు కల్పిస్తున్న సౌకర్యాల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో డ్వామా ఏపీడీ రాజారావు, ఎపిఒ బి.జీవరత్నం,ఉపాధి టిఎ, ఎఫ్ఎ, కూలీలు తదితరులు పాల్గొన్నారు.

గృహ నిర్మాణాలు పరిశీలన

ప్రజాశక్తి-దొనకొండ

మండల పరిధిలోని రుద్రసముద్రం వద్ద ఏర్పాటు చేసిన జగనన్న కాలనీ లేఅవుట్‌ను జిల్లా పంచాయతీ అధికారి, మండల ప్రత్యేకాధికారి జివి. నారాయణరెడ్డి శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన లబ్ధిదారులతో మాట్లాడి వారి సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం డంపింగ్ యార్డును పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ వి.వసంతరావు నాయక్, డిటీ శ్రీనివాసరావు, ఎపిఎం వెంకటేశ్వర్లు, ఇఒపిఆర్‌డి ఎస్.డేవిడ్, ఎపిఒ టి.దేవయ్య, హౌసింగ్, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. **యర్రగొండపాలెం:** గృహాల నిర్మాణాలను లబ్ధిదారులు త్వరితగతిన చేపట్టాలని ఎంపిడిఒ రంగసుబ్బా రాయుడు తెలిపారు. మండల పరిధిలోని మిల్లంపల్లి టోల్‌ప్లాజా దగ్గర ఉన్న జగనన్న కాలనీని శుక్రవారం సందర్శించారు. అనంతరం లబ్ధిదారులతో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ ఎఇ అంజిరెడ్డి, వైఎస్ఆర్ ఇందిర క్రాంతి పథం ఎసి లక్ష్మిరెడ్డి, సచివాలయ సిబ్బంది, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు. **మద్దిపాడు:** జగనన్న కాలనీ లేఅవుట్లలోని లబ్ధిదారులు ఉగాది నాటికి గృహ నిర్మాణాలను పూర్తి చేసుకోవాలని మండల ప్రత్యేక అధికారి రూన్సీ రాణి తెలిపారు. మండల పరిధిలోని సీతారామపురంలోని జగనన్న కాలనీ లేఅవుట్‌ను దర్శించారు. అనంతరం లబ్ధిదారులతో సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దారు జె. లక్ష్మి నారాయణ, హౌసింగ్ ఎఇ హేమలత, ఎంపిపి నరేంద్రకుమార్ తదితరులు పాల్గొన్నారు.

తల్లిదండ్రుల సంరక్షణ బాధ్యత పిల్లలదే

ప్రజాశక్తి - గిద్దలూరు

వృద్ధాప్యంలో తల్లిదండ్రులను పోషించాల్సిన బాధ్యత వారి పిల్లలదేనని, ఇది నైతిక, సామాజిక బాధ్యత మాత్రమే కాదని, చట్టం కూడా ఇదే విషయాన్ని నిర్దేశిస్తోందని న్యాయవాది ఎం.పిచ్చయ్య యాదవ్ తెలిపారు. స్థానిక విశ్రాంత ఉద్యోగుల కార్యాలయంలో న్యాయ విజ్ఞాన సదస్సు శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయవాది పిచ్చయ్య మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో మారిన పరిస్థితుల కారణంగా వద్దులైన తమ తల్లిదండ్రుల ఆలనాపాలనను వారి పిల్లలు విస్మరిస్తున్నట్లు తెలిపారు. అందులో భాగంగా వృద్ధుల రక్షణ కోసం ప్రభుత్వం ప్రత్యేక చట్టాన్ని తీసుకొచ్చినట్లు తెలిపారు. వద్ధాప్యంలో కొడుకు, కోడలు సరిగా చూసుకోక పోయినా ఆహారం, ఆరోగ్య విషయంలో ఇబ్బందులు వస్తే మండల న్యాయసేవాధికార సంస్థ దృష్టికి తేస్తే న్యాయం జరిగేలా చూస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్‌జిఒ అసోసియేషన్ అధ్యక్షుడు.జి.రవీంద్రానాధ్ రెడ్డి, ఎస్.కొండయ్య, వై.రంగయ్య, పారాలీగల్ వాలంటీర్ అర్థంకి మధుసూదనరావు, విశ్రాంత ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న న్యాయవాది పిచ్చయ్య

పేదల సంక్షేమం కోసం కృషి : వరికూటి

ప్రజాశక్తి- జరుగుమల్లి

పేదల సంక్షేమం కోసం ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి కృషి చేస్తున్నట్లు వైసిపి కొండపి నియోజక వర్గ ఇన్‌ఛార్జి వరికూటి అశోక్‌బాబు తెలిపారు. జరుగుమల్లి గ్రామంలోగడప గడపకూ మన ప్రభుత్వం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా అశోక్‌బాబు గడపగడపకూ తిరిగి ప్రభుత్వ సంక్షేమ పథకాల గురించి వివరించారు. ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడు దగ్గుమాటి బూసిరెడ్డి, ఎంపిడిఒ పి.రామకృష్ణ, దుంపా అనిల్ కుమార్‌రెడ్డి, మారెడ్డి జయ రామిరెడ్డి, కృష్ణారెడ్డి, కసుకుర్తి బద్రి, గుజ్జు సుబ్బారావు, మేడికొండ కొండలరావు, కసుకుర్తి నాగరాజు, బల్లికూర రాంబాబు, కసుకుర్తి పున్నారావు తదితరులు పాల్గొన్నారు.



స్థానికులతో మాట్లాడుతున్న వరికూటి అశోక్‌బాబు

నేతాజీ విద్యార్థులకు రైల్వే ఉద్యోగాలు

ప్రజాశక్తి-మార్కాపురం

రైల్వే రిక్రూట్‌మెంట్ బోర్డు (ఆర్ఆర్‌బి) విడుదల చేసిన నాన్ టెక్నికల్ పాపులర్ కేటగిరీ లెవల్-5కి సంబంధించి పార్ట్-2 ఫలితాల్లో స్థానిక నేతాజి ఇనిస్టిట్యూట్ ఆఫ్ కాంపిటీటివ్ ఎగ్జామ్స్ (నైస్) సంస్థలో శిక్షణ పొందిన వెన్నంటి శ్రీనివాసరెడ్డి, ఉప్పు సుదర్శన్ ట్రైన్స్ మేనేజర్ ఉద్యోగాలకు ఎంపికైనట్లు ఆ సంస్థ గౌరవ సలహాదారుడు కొత్తేర్వ కాశిరెడ్డి శుక్రవారం తెలిపారు. ఈ సందర్భంగా ఉద్యోగాలు సాధించిన ఉప్పు సుదర్శన్, వెన్నంటి శ్రీనివాసరెడ్డిని అధ్యాపక బృందం తారక బ్రహ్మం, శేషులు, రమణారెడ్డి, నబి, గౌతమ్, ఫణికుమార్, నాగరాజు అభినందించారు.

ఊహించని విధంగా సంక్షేమం: డిప్యూటీ సీఎం

ప్రజాశక్తి-పర్చూరు

ఎవరూ ఊహించని విధంగా సంక్షేమ కార్యక్రమాలు అమలు జరుగుతున్నాయని ఉపముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ పేర్కొన్నారు. పర్చూరు మండలం నూతలపాడు గ్రామంలో రూ.2 కోట్లతో నిర్మించనున్న తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో కళ్యాణ మండపాన్ని వైవి సుబ్బారెడ్డితో కలిసి మంత్రులు కొట్టు సత్యనారాయణ, మేరుగ నాగార్జునలు శుక్రవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా జరిగిన సభకు వైసిపి పర్చూరు సమన్వయకర్త ఆమంచి కృష్ణ మోహన్ అధ్యక్షత వహించారు. ఉప ముఖ్యమంత్రి మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌లో గత మూడున్నర సంవత్సరాలుగా జరుగుతున్న పాలన పొరుగు రాష్ట్రాలను ఆశ్చర్యానికి గురి చేసే విధంగా ఉందన్నారు. విచ్చలవిడిగా రాష్ట్రాన్ని దోచుకున్న నాయకులు వైఎస్ జగన్ పరిపాలనను విమర్శించటం హాస్యాస్పదంగా ఉందన్నారు. పర్చూరుకు సమర్థవంతమైన నాయకుడు ఆమంచి కృష్ణమోహన్ వచ్చాడని, రాబోయే ఎన్నికల్లో పర్చూరు గడ్డపై వైసిపి జెండా ఎగురవేయాలని పిలుపునిచ్చారు. సాంఘిక సంక్షేమ శాఖా మంత్రి మేరుగ నాగార్జున మాట్లాడుతూ సుపరిపాలన చేస్తున్న ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డికి ప్రజల అండదండలు ఉండాలని కోరారు. టిటిడి ఛైర్మన్ వైవి సుబ్బారెడ్డి మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేని విధంగా రాష్ట్రంలో స్వచ్ఛంగా పథకాలు అమలవుతున్నాయన్నారు. పవన్ కళ్యాణ్, చంద్రబాబు కొన్ని మీడియా సంస్థలతో కలిసి


నూతలపాడు సభలో మాట్లాడుతున్న వైవి సుబ్బారెడ్డి

చేసే దుష్ప్రచారాన్ని తిప్పికొట్టాలని సూచించారు. రాజ్యసభ సభ్యులు మోపిదేవి వెంకటరమణ మాట్లాడుతూ చిన్న చిన్న మనస్పర్థలను పక్కనపెట్టి పర్చూరు గడ్డపై వైసిపి జెండా ఎగురవేయటమే ముఖ్య లక్ష్యంగా కార్యకర్తలు పని చేయాలని కోరారు. బాపట్ల, పల్నాడు, గుంటూరు జిల్లాల పరిశీలకులు, రాజ్యసభ్య సభ్యులు బీదా మస్తాన్‌రావు మాట్లాడుతూ పర్చూరులో ఘన విజయంతో ఆమంచిని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో బాపట్ల ఎంపి నందిగం సురేష్, ఎమ్మెల్సీ పోతుల సునీత, బత్తుల బ్రహ్మానందరెడ్డి, రావి రామనాథంబాబు, కమిటీ సభ్యులు పోలూరి శివారెడ్డి, భవనం రాజగోపాల్‌రెడ్డి, కుర్రి బాపిరెడ్డి తదితరులు పాల్గొన్నారు. పర్చూరుకు చెందిన నృత్యశ్రీ అకాడమీ చేసిన కూచిపుడి భరతనాట్యం ఆహూతులను అలరించింది. తొలుత పర్చూరు బొమ్మల సెంటర్‌లో వైఎస్సార్, అంబేద్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం భారీ ర్యాలీతో ఇంకొల్లు రోడ్డులోని షిరిడి సాయి మందిరంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

జగన్మోహన్‌రెడ్డిని మరలా సీఎం చేద్దాం: వై.వి

మేదరమెట్ల: వైఎస్ జగన్మోహన్‌రెడ్డిని రెండోసారి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా చేయవలసిన బాధ్యత మన అందరిపై ఉందని తిరుపతి తిరుమల దేవస్థానం అధ్యక్షులు వైవి సుబ్బారెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని మేదరమెట్ల గ్రామంలో సుమారు 10 కోట్ల రూపాయల అభివృద్ధి పనులకు శంకుస్థాపన మరియు ప్రారంభోత్సవాలు చేశారు. నూతనంగా నిర్మించిన కళ్యాణ మండపం, మరియు ఎర్రం చిన్న పోలిరెడ్డి హాస్పటల్ నూతన భవనం ప్రారంభోత్సవం, సెంట్రల్ లైటింగ్ మరియు ఇంటింటికి కులాయి పథకం, రావినూతల రోడ్డులో సిమెంటు రోడ్డు సైడ్ కాలవల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో ఉపముఖ్యమంత్రి దేవదాయ శాఖ మంత్రి కొట్టు సత్య నారాయణ, ప్రకాశం జిల్లా పరిషత్ ఛైర్మన్ బుచేపల్లి వెంకా యమ్మ, అద్దంకి వైసీపీ ఇంచార్జ్ బాచిన కృష్ణ చైతన్య, మాదిగ కార్పొరేషన్ ఛైర్మన్ కొమ్మూరి కనకారావు, మండల అధ్యక్షులు సాదినేని ప్రసన్నకుమారి, జడ్పిటిసి సభ్యులు తుళ్లూరి వెంకటరమణ, గ్రామ సర్పంచ్ బొనిగెల ఎలిసెమ్మ, మాజీ శాసనసభ్యులు భూసేపల్లి శివప్రసాద్ రెడ్డి, బాచిన చెంచు గరటయ్య, మాజీ సర్పంచ్ జజ్జన ఆనందరావు, ఎఎంసి వైస్ ఛైర్మన్ వైవి రత్నారెడ్డి మండల కన్వీనర్ సాదినేని మస్తాన్‌రావు, వైసీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ముగ్గుల పోటీ విజేతలకు బహుమతులు

ప్రజాశక్తి-అద్దంకి: వాసవీ క్లబ్, వనితక్లబ్ వారి ఆధ్వర్యాన గీతామందిరంలో సంక్రాంతి ముగ్గుల పోటీలు, భగవద్గీత పోటీలు శుక్రవారం నిర్వహించారు. ముందుగా చిన్నారులకు భోగి పండ్లు పోసి పెద్దలు ఆశీర్వదించారు. వాసవి క్లబ్ డిస్ట్రిక్ట్ గవర్నరు ఊటుకూరి ఉమా అన్నపూర్ణ మాట్లాడుతూ, అందరూ కలసి ఆనందంగా జరుపుకునే పండుగ సంక్రాంతి అని, వంటావార్పులతో పాటు, అందమైన, ఆకర్షణీయమైన రంగవల్లులు వేయడంలో కూడా ఆడవారు ఆరితేరినవారని చెప్పడానికే ఈ ముగ్గుల పోటీలను ఏర్పాటు చేశామని తెలియజేశారు. భోగ భాగ్యాలనిచ్చే భోగి వేడుకను, కన్నులపండువగా వాసవి మహిళలు జరిపారు. అనంతరం జరిగిన సభలో పుట్టంరాజు శ్రీరామచంద్రమూర్తి సంక్రాంతి ముగ్గుల ప్రాముఖ్యత గూర్చి వివరించారు. పుట్టంరాజు బుల్లెయ్య, రామలక్ష్మమ్మ ఛారిటబుల్ ట్రస్టు పక్షాన ముగ్గుల పోటీల్లో గెలుపొందినవారికి వరుసగా రూ.2,000, రూ.1,500, రూ.1,000, భగవద్గీత పోటీల్లో విజేతలైన చిన్నారులకు వరుసగా రూ.1,000, రూ.700, రూ.500ను పుట్టంరాజు శ్రీరామచంద్రమూర్తి, శైలజ అందించారు. సభా కార్యక్రమాన్ని వాసవీ క్లబ్ బాధ్యులు ఆత్మకూరి ఆంజనేయులు, శిరీష, ఊడత్తు ఆదినారాయణ, విజయలక్ష్మి, జి పాపారావు, ఆదిలక్ష్మి, క్యాబినెట్ సెక్రటరీ గ్రంథి నాగరాజకుమారి నిర్వహించారు. ఈ కార్యక్రమంలో లఘుమారపు వెంకట శ్రీదేవి, రజిత, అరుణ, పి జయలక్ష్మి, ఎల్ పద్మావతి, బి అన్నపూర్ణ తదితరులు పాల్గొన్నారు.

భామాకలాపం నృత్య రూపకం అదుర్స్

ప్రజాశక్తి-ఇంకొల్లు రూరల్

ఎన్‌టిఆర్ శత జయంతి ఉత్సవాల్లో భాగంగా 5వ రోజు కార్యక్రమాలను తిలకించేందుకు ప్రజలు పోటెత్తారు. 5వ రోజు శుక్రవారం కార్యక్రమాలు అదుర్స్ అనిపించాయి. సంక్రాంతి పండుగ సెలవులు కావటంతో వివిధ గ్రామాల నుంచి సొంత ఊర్లకు వచ్చిన వారితో వేదిక కిక్కిరిసిపోయింది. రోజురోజుకూ ప్రదర్శనలు తిలకించేందుకు పెద్దఎత్తున ప్రజలు తరలివస్తున్నారు. హైదరాబాదుకు చెందిన భారత రంగస్థల అకాడమీ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్ వారు రూపొందించిన భామా కలాపం సంగీత నృత్య రూపకం అలరించింది. శ్రీప్రసన్నాంజనేయ నాదస్వర బృందం వారిచే నాదస్వర కచేరీ భళా అనిపించింది. న్యూజనరేషన్ హైస్కూలు కోలాట సమాజం మాస్టారు తన్నీరు అంకమరావు విద్యార్థులచే కోలాట ప్రదర్శన నిర్వహించారు. అనంతరం ఇంకొల్లు ఎంఆర్‌ఆర్ ప్రకాశం హైస్కూలు విద్యార్థులచే పలు సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి. విద్యార్థులు వివిధ వేషధారణలతో ప్రదర్శనలు నిర్వహించారు. ఎన్‌టిఆర్ పాటలతో అనుకరించి డ్యాన్సులు చేశారు. ఈ సందర్భంగా ఎన్‌టిఆర్ కళాపరిషత్ అధ్యక్షులు ఈదర హరిబాబు విద్యార్థులను, పాఠశాల


చిన్నారుల కోలాటం

యాజమాన్యాన్ని అభినందించారు. పాఠశాలకు షీల్డు బహూకరించారు. చివరిగా భారత రంగస్థల అకాడమీ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్ హైదరాబాదు వారిచే భామా కలాపం సంగీత నృత్య ప్రదర్శన నిర్వహించారు. ప్రదర్శనకు దర్శకత్వం వహించిన కోకా విజయలక్ష్మిని ఈదర హరిబాబు అభినందించారు.

నేటి కార్యక్రమాలు

గరికపర్రుకు చెందిన రాజీవ్ బ్రదర్స్ జానపద డప్పుల సమాజం వారిచే డప్పుల విన్యాసం వి సుధాకర్ ఆధ్వర్యంలో జరుగుతుంది. ఇంకొల్లు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులచే సింహాద్రి వెంకటరెడ్డి మాస్టారి కోలాట ప్రదర్శన జరుగుతుంది. విజయవాడకు చెందిన డాక్టర్ రామన్ ఫౌండేషన్, సాయిబాబా నాట్య మండలి వారిచే సంస్కార భారతి ఆంధ్రప్రదేశ్ సౌజన్యంతో స్వాతంత్ర్య సంగ్రామం నాటకం జరుగుతుంది.

'మా భూములు మాకే చెందాలి'

ప్రజాశక్తి-భట్టిప్రోలు

ఎన్నో ఏళ్ల క్రితం ప్రభుత్వం అందించిన సొసైటీ భూములు సాగు పత్రాలు ఉన్న దళితులకే నమోదు చేసి పట్టాలు మంజూరు చేయాలని లంక గ్రామాల సొసైటీ భూముల రైతులు డిమాండ్ చేస్తున్నారు. ఈ మేరకు బుధవారం చింతమోటు గ్రామ సొసైటీ భూముల రైతులు అధికారులు నమోదుచేసే భూముల వద్ద ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం కేటాయించిన సొసైటీ భూములు చిన్న చిన్న కమతాలుగా ఉండటమే కాక బోరు వసతి సరిగాలేని భాగాలను కొంతమంది కౌలుకు ఇచ్చారన్నారు. దీని కారణంగా సంబంధిత సర్వే, రెవెన్యూ అధికారులు, సొసైటీ కమిటీ వారు కుమ్మక్కై కౌలుకు తీసుకున్న వారి పేర్లు కూడా నమోదు చేస్తున్నారని, దీనివలన సాగు పత్రాలు కలిగిన నిజమైన దళిత రైతులమైన తమకు అన్యాయం జరిగే ప్రమాదం ఉందన్నారు. సాగుపత్రాలు ఉన్న రైతుల పేర్లు మాత్రమే నమోదు చేసి వారికి గాని, వారి కుటుంబ సభ్యులకు గాను పట్టాలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు.

హైకోర్టు తీర్పు ప్రకారం భూములు అప్పగించాలి

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

హైకోర్టు తీర్పు ప్రకారం భీమవరం బాధితులకు భూములు అప్పగించాలని ఒంగోలు తహశీల్దార్ మురళిని దళిత నేత నీలం నాగేంద్రరావు కోరారు. స్థానిక ఒంగోలు తహసీల్దార్ కార్యాలయం లో భీమవరం బాధితులైన భూ స్వాధీన కమిటీ నాయకులు కనకరాజు, మోషే తదితరులు కలిసి నీలం నాగేంద్రరావు ఒంగోలు తహశీల్దార్ మురళిని శుక్రవారం కలిశారు.


తహశీల్దార్ మురళికి విన్నవిస్తున్న నీలం నాగేంద్రరావు

ఘనంగా సంక్రాంతి సంబరాలు

ప్రజాశక్తి-ఒంగోలు

స్థానిక లాయరు పేటలోని ఫ్రీడమ్‌బర్డ్స్‌లో సంక్రాంతి సంబరాలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సంబరాలలో విద్యార్థులు వారి తల్లిదండ్రులతో కలిసి సందడి చేశారు. ఈ సందర్భంగా డైరెక్టర్ ఎన్.పుష్పేశ్వరి మాట్లాడుతూ పండుగలు మన సంస్కృతిలో భాగమని, మన సంస్కృతి, సాంప్రదాయాలను చిన్నారులకు తెలియజేసే విధంగా పండుగలను జరుపుకోవాలని సూచించారు. చిన్నారుల వేషధారణలు అలరించాయి.



సంబరాలలో ఫ్రీడమ్‌బర్డ్స్ చిన్నారులు, తల్లిదండ్రులు


తిరుమంజన సేవలో శిద్దారాఘవరావు, లక్ష్మీ పద్మావతి దంపతులు

తిరుమంజన సేవలో మాజీ మంత్రి శిద్దా

ప్రజాశక్తి-చీమకుర్తి

మండలంలోని అగ్రహారంలోని శ్రీప్రసన్న వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో ధనుర్మాసం మహోత్సవంలో తిరుమంజనం సేవలో రాష్ట్ర మాజీ మంత్రి శిద్దారాఘవరావు, లక్ష్మీ పద్మావతి దంపతులు విశేష పూజలు నిర్వహించారు. శుక్రవారం శిద్దా రాఘవరావు దంపతుల ఆధ్వర్యంలో కైంకర్య పోషకులుగా వ్యవహరించారు. పట్టువస్త్రాలు, పూజాలంకరణలు, గోదాదేవి వ్రతం నిర్వహించారు. ఈ సందర్భంగా అన్నదానం చేశారు. శిద్దా దంపతులకు ఆలయ పూజారులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు శిద్దా వెంకటేశ్వరరావు దంపతులు, శిద్దా సూర్యప్రకాష్‌రావు, శిద్దా హనుమంతరావు దంపతులు, శిద్దా సుధాకర్, శిద్దా పెదబాబు, శిద్దా సాయిబాబు, ఉదయ్ పాల్గొన్నారు.

సురేపల్లిలో ముగ్గుల పోటీలు

ప్రజాశక్తి-భట్టిప్రోలు

మండలంలోని సురేపల్లి గ్రామంలో శుక్రవారం ఎఫ్ఎంసి కంపెనీ ఆధ్వర్యంలో సంక్రాంతిని పురస్కరించుకుని మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. పోటీలలో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో కంపెనీ ప్రతినిధులు శ్రీనివాసరావు, సంగమేశ్వరరావు పాల్గొన్నారు. అలాగే పల్లెకోనలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. నాయకులు చిన బుజ్జి, ప్రదీప్, సేరు శ్రీనివాసరావు, మోర్ల శ్రీనివాసరావు, ఎంపిపి లలితకుమారి, జడ్పిటిసి ఉదయ్ భాస్కరి తదితరులు పాల్గొన్నారు.

యుటిఎఫ్ కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి-భట్టిప్రోలు

భట్టిప్రోలు మండల ఐక్య ఉపాధ్యాయ సంఘం నూతన కమిటీ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులుగా వి సురేష్ కుమార్, ఎం శ్రీనివాసరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. స్థానిక యుటిఎఫ్ కార్యాలయంలో జరిగిన కమిటీ ఎంపికకు ముఖ్య అతిథులుగా బాపట్ల జిల్లా అధ్యక్షులు జె వినయ్ కుమార్, కార్యదర్శిగా జి శాంతారావు హాజరయ్యారు. కాగా గౌరవ అధ్యక్షులుగా కె లక్ష్మీనారాయణ, కోశాధికారులుగా టి శ్రీనివాస్, సహాధ్యక్షులుగా వివి ప్రసాద్, ఎం కృష్ణప్రియ, కార్యదర్శులుగా మక్బుల్ బాషా, టి శ్రీధర్, రోజారమణి, రాంబాబు, జిల్లా కమిటీకి ఎండి ఆయుబ్, ఏకాంబరాచారి ఎంపికయ్యారు. ఈ కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు కె.వి సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యశ్రీ ద్వారా అన్ని రకాల ఆపరేషన్లు: దేవరాజు

ప్రజాశక్తి-చీరాల

ఊర మస్తాన్‌రావు, శివ రాజకుమారి ట్రస్ట్ వారి సహకారంతో శ్రీ కామాక్షి కేర్ హాస్పిటల్ జనరల్ ఎముకలు మరియు కంటి వైద్యుల బృందం సంపత్ నగర్లోని విఎంఆర్ ఫంక్షన్ హాల్ వద్ద ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ ఉచిత వైద్య శిబిరంలో శ్రీ కామాక్షి కేర్ హాస్పిటల్ పర్మినెంట్ వైద్య బృందం అయిన ఎముకలు కీళ్ల స్పెషలిస్ట్ ముకేశ్‌రెడ్డి విష జ్వరాలు మరియు షుగర్ స్పెషలిస్ట్ డాక్టర్ తులసిరామ్, కంటి వైద్య నిపుణులు డాక్టర్ తాడివలస కుమార్ పాల్గొని రోగులకు వైద్య సేవలు అందించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కామాక్షి కేర్ హాస్పిటల్ ఎండి తాడివలస దేవరాజు మాట్లాడుతూ వూర మస్తాన్ రావు అండ్ శివ కుమారి ట్రస్ట్ వారి సహకారంతో ఉచిత వైద్య శిబిరం నిర్వహించడం ఎంతో ఆనందంగా ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో వూర మస్తాన్‌రావు, శివ రాజకుమారి, తాడివలస సురేష్ కుమార్, కాసా మురళి, నంగు రాజశేఖర్ రెడ్డి, మరియు హాస్పటల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మంత్రి సురేష్

మాకు చెప్పులు లేవా?

పవన్‌పై మంత్రి సురేష్ ఆగ్రహం

ప్రజాశక్తి-పుల్లలచెరువు

'మాట్లాడితే చెప్పు చూపిస్తున్నావ్.. మాకు, మా కార్యకర్తలకు చెప్పులు లేవా? అంటూ పవన్ కల్యాణ్‌పై రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం పుల్లలచెరువులో జరిగిన కన్వీనర్లు, వాలంటీర్లు, పార్టీ నాయకుల విస్తృత స్థాయి సమావేశంలో ఆయన మాట్లా డారు. ప్రస్తుతం తెలుగుదేశం పార్టీ పరిస్థితి అగమ్యగోచరంగా తయారైందన్నారు. వాలం టరీ వ్యవస్థను నిర్వీర్యం చేసేందుకు కుట్రలు చేస్తున్నారని అన్నారు. మంత్రి ఏమి చేశారని మాట్లాడుతున్న టిడిపి నాయకులకు సవాల్ విసిరారు. మీరు తిరిగే సీసీ రోడ్డు మేము చేసినవే అని చెప్పారు. యర్రగొండపాలెం నియోజకవర్గంలో మీరు ఏమైనా చేసి ఉంటే చూపించి మాట్లాడాలని పేర్కొన్నారు. పవన్ కల్యాణ్ తీరుపై తీవ్ర స్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. రెండు చోట్లకు మించి పోటీ చేయకూడదు గానీ లేకుంటే 175 చోట్ల పవన్ కల్యాణే పోటీ చేసేవాడని ఎద్దేవా చేశారు. సమావేశంలో ఏఎంసి చైర్మన్ ఉడుముల శ్రీనివాసరెడ్డి, మండల కన్వీనర్ బివి సుబ్బారెడ్డి, ఎంపిపి మందా లాజర్, జడ్పిటిసి వాగ్యా నాయక్ తదితరులు పాల్గొన్నారు.

సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపిన మంత్రి

ప్రజలందరికీ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. తెలుగు వారి సంస్కృతి, సంప్రదాయాలకు సంక్రాంతి పండుగ ప్రతీక అని పేర్కొన్నారు.

సంస్కృతి, సాంప్రదాయాలను గౌరవించాలి

- కలెక్టర్ విజయకృష్ణన్
- బాపట్ల కలెక్టరేట్ ఆవరణలో సంక్రాంతి సంబరాలు

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

మన సంస్కృతి, సంప్రదాయాలను ప్రతి ఒక్కరూ గౌరవించాలని, వాటిని భావితరాలకు అందించాలని కలెక్టర్ కె.విజయకృష్ణన్ చెప్పారు. సంక్రాంతి సంబరాలు బాపట్లలో శుక్రవారం వైభవంగా నిర్వహించారు. బాపట్ల జిల్లా ఏర్పడ్డాక తొలిసారిగా సంక్రాంతి పండుగ ఉత్సవాలను స్థానిక జిల్లా కలెక్టరేట్ ఆవరణలో జిల్లా యంత్రాంగం అధికారికంగా నిర్వహించారు. సంక్రాంతి పండుగ ఉత్సవాలు బాపట్లలో అంబరాన్నంటాయి. పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించిన ఎద్దుల బండిపై జిల్లా కలెక్టర్, జిల్లా సంయుక్త కలెక్టర్‌ను ఊరేగింపుగా వేడుకల ప్రాంగణం వద్దకు వచ్చారు. హరిదాసుల కచేరి, గంగిరెద్దుల రంకెలు, గాలిపటాల సందడి, చిన్నారుల కేరింతలు, మహిళల కరతాల ధ్వనులతో కలెక్టరేట్ ప్రాంగణమంతా సంక్రాంతి పండగ శోభను తెచ్చింది. జిల్లా అధికారులు తాడాట ఆడుతూ అందరినీ ఉత్సాహపరిచారు. కలెక్టర్ విజయకష్ణన్, జిల్లా ఎస్పీ వకుల్ జిందల్, జిల్లా సంయుక్త కలెక్టర్ డాక్టర్ కె.శ్రీనివాసులు గాలిపటాలు ఎగురవేసి అధికారులు, ప్రజల్లోనూ మరింత ఉత్సాహాన్ని నింపారు.



సంక్రాంతి సంబరాలలో పాల్గొన్న కలెక్టర్, ఎస్‌పి, జేసీ

జిల్లా కలెక్టర్ విజయకష్ణన్, జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ భోగి మంటలు వేశారు. భోగి మంటల చుట్టూ కోలాటం చేస్తున్న మహిళా కళాకారులతో కలిసి కోలాట నత్యంలోనూ పాల్గొన్నారు. పుష్కలంగా పంటలు చేతికి వచ్చాయంటూ మహిళలు గానం చేస్తుండగా నవధాన్యాలను కలెక్టర్, ఎస్పీలు తిరగలితో విసిరి, కొత్తగా వచ్చిన ధాన్యాన్ని రోకలితో దంచి వేడుకలను అట్టహాసంగా ప్రారంభించారు. మజ్జిగ చిలికి వెన్న తీయడం, చిన్నారులకు భోగి పండ్లు పోసి ప్రత్యేకంగా దీవించారు. వ్యవసాయశాఖ, మెప్మా, మహిళా, శిశు సంక్షేమ శాఖలు ఏర్పాటు చేసిన సంప్రదాయ పొంగలి తయారీని కలెక్టర్ ప్రారంభించారు. మహిళల కోలాట ప్రదర్శనతో ప్రాంగణంలో సందడి వాతావరణం నెలకొంది.

సంక్రాంతి పండుగ నేపథ్యంలో రంగవల్లులు, లెమన్ అండ్ స్పూన్, తాడాట, బొంగరాలాట, మ్యూజికల్ చైర్స్ ఆటలతో కలెక్టరేట్ ప్రాంగణం ఆనందోత్సాహాలతో నిండిపోయింది. సంక్రాంతి వేడుకలు కలెక్టరేట్ లో కనుల పండుగగా జరిగాయి. ఉద్యోగులు, మహిళలు ఉత్సాహంగా వేడుకల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో డిఆర్ఒ కె.లక్ష్మీశివజ్యోతి, బాపట్ల, చీరాల ఆర్‌డిఒలు జి.రవీందర్, పి.సరోజిని, వివిధ శాఖల జిల్లా అధికారులు, కలెక్టరేట్ ఎఓ పార్వతి, మహిళలు పాల్గొన్నారు.

డాక్టరేట్ సాధించడం అభినందనీయం

ఎమ్మెల్సీ లక్ష్మణరావు

ప్రజాశక్తి-మార్టూరు రూరల్

గ్రామీణ ప్రాంతంలో పుట్టి.. వివిధ రంగాల్లో పరిశోధనలు చేసి.. డాక్టరేట్ సాధించి ఉన్నత స్థాయికి చేరుకోవడం హర్షనీయమని ఎమ్మెల్సీ కేఎస్.లక్ష్మణరావు అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని కోలలపూడి గౌడ కమ్యూనిటీ హాలులో గ్రామ విద్యావేదిక ఆధ్వర్యంలో గ్రామానికి చెందిన డాక్టరేట్ సాధించిన విద్యావేత్తలకు గ్రామస్తులు సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. 'చదువుకు అభినందన సభ' పేరుతో ఏర్పాటుచేసిన ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా లక్ష్మణరావు మాట్లాడారు. గ్రామ ప్రతిష్టను ఇనుమడించేలా చేసిన డాక్టర్ ఎనుముల వెంకటనారాయణ, డాక్టర్ కందిమళ్ల సాంబశివరావు, డాక్టర్ బొడ్డు రంగారావు, డాక్టర్ కొమ్మాలపాటి ప్రభుదాస్‌ల కషి అభినందనీయమన్నారు. అనంతరం డాక్టరేట్ పొందిన నలుగురు విద్యావేత్తలను గ్రామస్తులు ఘనంగా సన్మానించారు.

'గద్దలగుంట'లో సంబరాల కరపత్రం ఆవిష్కరణ

ప్రజాశక్తి-ఒంగోలు



కరపత్రం ఆవిష్కరిస్తున్న కమిటీ సభ్యులు

గద్దలగుంట గ్రామ అభివద్ధి కమిటీ ఆధ్వర్యంలో 21వ వార్షికోత్సవ సంక్రాంతి సంబరాల కరపత్ర ఆవిష్కరణ గద్దలగుంట పార్కులో శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు ఓగిరాల రాధాకృష్ణమూర్తి, ఆరిగ శ్రీనివాసులు మాట్లాడుతూ సంక్రాంతి సందర్భంగా మూడు రోజులపాటు మహిళలకు ముగ్గుల పోటీలు చిన్నారులకు 21 రకాల ఆటల పోటీలు, నాట్యం పాటల పోటీలు జరుగుతాయన్నారు. విజేతలకు 15వ తేదీ సాయంత్రం జరిగే బహుమతి ప్రదానోత్సవసభలో మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి పాల్గొని.. బహుమతులు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో 32వ డివిజన్ కార్పొరేటర్ తాడి కృష్ణలత, శ్రీ ప్రసన్న చెన్నకేశవ స్వామి దేవస్థాన ధర్మకర్తల మండలి చైర్మన్ ఈదుపల్లి గురునాథరావు , సభ్యులు కుర్రా ప్రసాద్ బాబు, కమిటీ సభ్యులు కాటా నాగేశ్వరరావు ఈదుపల్లి అంకబాబు కొల్లా మధు, ఈదుపల్లి నాగేశ్వరరావు, చిట్టెం వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.


ఉత్సాహంగా ఆటల పోటీలు

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

సంక్రాంతి పండుగ సందర్భంగా 35వ డివిజన్ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో స్థానిక ఉమా మహేశ్వర జూనియర్ కళాశాల వద్ద నిర్వహించిన నగర స్థాయి ముగ్గులు, ఆటల పోటీలు ఉత్సాహంగా జరిగాయి. ముగ్గుల పోటీలను బెతూన్ నర్సింగ్ హోం వైద్యులు డాక్టర్ స్వాతి ప్రారంభించారు. పోటీల న్యాయనిర్ణేతలుగా తూము సునీత, సంధ్య రంగుల, మండవ సునీత, నాగ రాజకుమారి వ్యవహరించారు. అనంతరం జరిగిన సభకు నిర్వహణ కమిటీ కన్వీనర్ దామా శ్రీనివాసులు అధ్యక్షత వహించారు. సభను ఉద్దేశించి డాక్టర్ ఎన్.ఉదయిని, ఉమా మహేశ్వర జూనియర్ కళాశాల డైరెక్టర్ సిహెచ్ నాగమల్లేశ్వరరావు, డాక్టర్ ఎం.ఉదయకృష్ణ, డాక్టర్ ఎస్.సందీప్, డాక్టర్ జ్యోత్స్న ప్రసంగిస్తూ సంక్రాంతి పండుగ సందర్భంగా పోటీలు నిర్వహించటం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో నిర్వహణ కమిటీ సభ్యులు సిహెచ్ లక్ష్మీనారాయణ, ఎస్‌వి రంగారెడ్డి, కె.హరిబాబు, ఎస్‌వి కొండారెడ్డి, ఆటల నిర్వహణ పిఇటి కె.వెంకటేశ్వరరావు, సిఐటియు నగర అధ్యక్షులు సిహెచ్ రాంబాబు, ఎస్.కోటేశ్వరరావు పాల్గొన్నారు.

మున్సిపల్ ఉద్యోగులకు 16 నుంచి ముఖ ఆధారిత హాజరు

- ఆప్కాస్ కార్మికులకు కూడా వర్తింపు
- స్మార్ట్‌ఫోన్‌లు కొనుక్కోవాలని కార్మికులకు ఆదేశాలు
- అంతా మున్సిపల్ ఆఫీసు వద్దకే వచ్చి ఫొటో దిగాలనే నిబంధనతో ఆందోళన



ప్రజాశక్తి-ఒంగోలు సబర్బన్

అన్ని ప్రభుత్వశాఖలతో పాటు మున్సిపల్ ఉద్యోగులకు ఫేషియల్ రికగ్నిజేషన్ బేషేడ్ అటిండెన్స్ సిస్టం(ఎఫ్ఆర్‌బిఎఎస్)ను అమలు చేయాలని ప్రభుత్వం నుంచి ఆదేశాలు అందాయి. ఈ మేరకు ప్రభుత్వం జీఓ నెంబర్ 159ని విడుదల చేసింది. అందులో అవుట్‌సోర్సింగ్ కార్మికులకు కూడా ముఖ హాజరు అమలు చేయాలని పేర్కొనడంతో ఆప్కాస్‌లో పని చేసే కార్మికులందరికీ కూడా అమలు చేయాలని నగర పాలక సంస్థ కమిషనర్ ఎం.వెంకటేశ్వరరావు ఈ నెల రెండో తేదీన సర్క్యులర్ జారీ చేశారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఉద్యోగులు, కార్మికులకు ముఖ ఆధారిత హాజరు తప్పనిసరిగా ఈ నెల 16 నుంచి నమోదు చేయాలని అందులో పేర్కొన్నారు. ప్రభుత్వం, ఉన్నతాధికారుల ఆదేశాలతో సెక్షన్ హెడ్‌లుగా ఉన్న మున్సిపల్ ఉద్యోగులు స్మార్ట్‌ఫోన్ లేని వారు వెంటనే కొనుక్కోవాలని సిబ్బంది, కార్మికులకు ఆదేశాలు జారీ చేస్తున్నారు. ఈ విధానంపై ఉద్యోగులు, కార్మికుల్లో అలజడి నెలకొని ఉంది. ముఖ హాజరుకు సంబంధించిన లొకేషన్ తెలియజేస్తూ యాప్ డౌన్‌లోడ్ చేసుకోవాలని తాజాగా ప్రభుత్వం ఆప్కాస్‌లో ఉన్న కార్మికుల సెల్‌ఫోన్‌లకు మెసెజ్ పంపడంతో కార్మికుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది.

మున్సిపల్ ఉద్యోగులు, కార్మికులకు ఈపాటికే ఎలక్ట్రానిక్ వేలిముద్ర (తంబ్), రిజిస్టర్‌లలో హాజరు నమోదు చేస్తున్నారు. ఇప్పుడు కొత్తగా ముఖ హాజరును కూడా ప్రభుత్వం తప్పనిసరి చేసింది. ఈ పాటికే ఉన్న తంబ్, రిజిస్టర్ అటెండెన్స్‌కు ఇది అదనం అనే ప్రచారం జరుగుతోంది. ఒంగోలు నగరపాలక సంస్థలో 202 మంది ఇన్‌డోర్, అవుట్ డోర్ స్టాఫ్ ఉన్నారు. ఆప్కాస్‌లో 916మంది అవుట్ సోర్సింగ్ కార్మికులు ఉన్నారు. ఉద్యోగుల ముఖ హాజరుకు కార్పొరేషన్ కార్యాలయమే లొకేషన్‌గా పేర్కొన్నారు. తాజాగా ఆప్కాస్ కార్మికుల సెల్ ఫోన్‌లకు వచ్చిన మెసెజ్‌లో కూడా లొకేషన్ మున్సిపల్ ఆఫీసే అని పొందుపరిచారు. ఇదే అమలయితే ఉద్యోగులు, కార్మికులు అంతా కలిపి 1118 మంది ప్రతి రోజూ ఉదయం, సాయంత్రం కార్పొరేషన్ కార్యాలయానికి వచ్చి ముఖ హాజరు నమోదు చేసుకోవాల్సి ఉంటుంది. కార్పొరేషన్ కేంద్రంగా 681 మంది పారిశుధ్య కార్మికులు పనిచేస్తున్నారు. ఇంజినీరింగ్ విభాగంలో 235 మంది కార్మికులు ఉన్నారు. వీరంతా ఆప్కాస్‌లో నమోదై ఉన్నారు. పారిశుధ్య కార్మికుల హాజరు ప్రతిరోజూ ఐదు మస్టర్ పాయింట్లు కేంద్రాలుగా నమోదు చేస్తున్నారు. కార్మికులు రెండు పూట్ల వారి వారి మస్టర్ పాయింట్లలో హాజరు పలికి విధులకు వెళుతున్నారు. ముఖ హాజరు విధానం అమల్లోకి వస్తే ఇక మీదట వీరి హాజరు మస్టర్ కేంద్రాల్లో కాకుండా కార్పొరేషన్ ఆఫీసే లొకేషన్‌గా ఉంటుందని చెబుతున్నారు. అదే జరిగితే కార్మికులకు తీవ్ర ఇబ్బందులు ఎదురయ్యే పరిస్థితి ఉంది. ఉద్యోగుల విషయం పక్కన పెడితే కార్మికుల్లో ఎక్కువ మంది నిరక్షరాస్యులు, తక్కువ చదుకున్న వారు, సాంకేతిక పరిజ్ఞానం తెలియని వారు ఉన్నారు. చాలామందికి స్మార్ట్‌ఫోన్‌లు కూడా లేవు. ఆప్కాస్‌లో కార్మికుల ఐడికి లింకు అయిన ఫోన్ నెంబర్ ఆధారంగా ముఖ హాజరు యాప్ డౌన్‌లోడ్ చేసుకోవాల్సి ఉంటుంది. కొంతమంది వద్ద ఆ ఫోన్ నెంబర్లు కూడా మనుగడలో లేవు. రోడ్లు చిమ్ముకునేవారు, పార్కుల్లో మొక్కలకు నీరు పెట్టేవారు, నీళ్లు వదిలేవారు, వాచ్‌మెన్‌లకు కూడా ముఖహాజరు పేరుతో ప్రభుత్వం కొత్త విధానాన్ని అమల్లోకి తీసుకు రావడం పట్ల కార్మిక సంఘాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి.

ఉద్యోగులకు తప్పనిసరి

ఎం.వెంకటేశ్వరరావు, కమిషనర్, ఒంగోలు

ప్రభుత్వ ఆదేశాల మేరకు మున్సిపల్ ఉద్యోగులందరికీ ఈ నెల 16వ తేదీ నుంచి ఎఫ్ఆర్‌బిఎఎస్ పద్ధతిలో ముఖ హాజరు నమోదుచేస్తాం. ఇది తప్పకుండా అమలు చేస్తాం. ఆప్కాస్ కార్మికుల్లో పారిశుధ్య కార్మికులకు ఈ విధానం ఈపాటికే అమల్లో ఉంది. అయితే పూర్తిస్థాయిలో అమలుకావడం లేదు. ఆప్కాస్ కార్మికులకు ఏ పద్ధతిలో ముఖహాజరు అమలు చేయాలనే దాని మీద స్పష్టత లేదు. ప్రభుత్వం ఇచ్చిన జీఓ 159 మీద మరింత స్పష్టత వచ్చిన తరువాత ఆప్కాస్ కార్మికుల ముఖ హాజరు విషయం ఆలోచిస్తాం..

కార్మికులను ఇబ్బంది పెడితే సహించం

శ్రీరామ్శ్రీనివాసరావు, సిఐటియు నాయకులు

ముఖ హాజరు పేరుతో ఉద్యోగులు, కార్మికులను ఇబ్బందులకు గురిచేస్తే సహించేది లేదు. ముఖ హాజరు విధానం వల్ల కార్మికుల మీద ప్రతిరోజు అదనపు ఖర్చు, పనిభారం పడుతోంది. ఫీల్డ్‌లో ఉండి ప్రజలతో కలిసి నిత్యం శ్రమ చేసే కార్మికుల పట్ల ఇలాంటి కొత్త విధానాలు తీసుకొచ్చి వేధింపులకు గురిచేయడం సరికాదు. ప్రభుత్వం తీసుకొచ్చిన జీఓను ఉపసంహరించుకోవాలి. లేని పక్షంలో కార్మికులతో కలిసి ఉద్యమిస్తాం.

పరికరాలు ఏర్పాటు చేయాలి

దూళ్ల నాగమల్లేశ్వరరావు, వైఎస్ఆర్‌టియుసి నేత

ముఖ హాజరు అమలు చేస్తే కార్మికులకు సాంకేతికంగా చాలా ఇబ్బందులు వస్తాయి. సిఎఫ్ఎంఎస్ ఐడికి గతంలో అనుసంధానం చేసిన ఫోన్ నెంబర్లు మనుగడలో లేనందున వారికి ఒటిపిలు రావడం లేదు. కార్మికుల్లో మెజారిటీ కార్మికులకు స్మార్ట్‌ఫోన్‌లు లేవు. సాంకేతిక పరిజ్ఞానం కూడా తక్కువ. కొంతమంది హార్ట్ పేషెంట్లు ఉన్నారు. వారు స్మార్ట్ ఫోన్‌లు వాడకూడదు. ముఖహాజరు తప్పనిసరి అయితే కార్పొరేషన్ కార్యాలయంలో ఎఫ్ఆర్‌బిఎఎస్‌కు అనుసంధానమైన ప్రత్యేక పరికరాలు ఏర్పాటు చేయాలి.